# తిన్నని బత్తి



నుడి కూర్పరి :

బగ్గాం సన్యాసప్పన్నకవి

ఓం నమశ్శివాయ

ఓం శ్రీ సుబ్రహ్మణ్యస్వామినే నమః

ఓం శ్రీ గణేశ శారదా గురుభ్యో న్నమః

# తిన్నని బత్తి

(అచ్చ తెలుఁగు)


నుడి కూర్పరి:

ఆంధ్ర భాషా విశారద,

బగ్గాం సన్యాసప్పన్నకవి

(భాగవతార్)

విశారద గ్రంథమాల
షష్ఠమ కుసుమము

★

శార్వరి సంవత్సర జ్యైష్ఠి
జూన్ 1960

★

అన్ని హక్కులు రచయితవి ★ వెల: ఒక రూపాయి

# ముందుమాట

"తిన్ననిబత్తి" అను నీ చిన్ని పొత్త మింతకుముందు వేల్పు కత (హరికథ) పోలిక నచ్చతెనుంగునఁ గూర్చితిని. ఇటీవల నా యనుంగుఁ జెలులు గొందఱిద్దానిని మామూలు పద్దెపు కబ్బముగా మార్చివేసినచో నెల్లచదువరులకు నింపొందించు నని యితవు సూపుటం జేసి వారి యాన నొదలఁదాల్చి మార్చి కూర్చితిని. ఇం దెల్లరకు నెఱుకపడని మారుమూలమాటలకై ప్రాకులాడక నా నేర్చినంతవఱ కందఱ కందుబాటగు తేట తెనుంగు మాటలనే కూర్చి కైత సాగించితిని. మఱియు వేల్పు కతలు సెప్పనేర్పుగల వారికి కూడ నుపయోగపడునట్లు వలసిన పాటలను పుటల కడుగునఁ జేర్చి అంకెల గుఱుతిడితిని. వాని నక్కఱగల చోట నతుకుకొని ఆటపాటలలో నేర్పరులగు వేల్పు కతలు సెప్పు ప్రోడ లాతీరున నీ కతను బత్తుల కందఁజేయఁగల రని నా యగ్గలఁపు టాస.

తెలుఁగు బాస యను మున్నీటి నీదనేర్చి మాటలను మానికము లేర్చి, కైతసరములఁ గూర్చుటకుఁ దలకొను నా వంటివాని బ్రతుకు నవ్వులాట యగునేమో! అయినను నాలో నీసరుని బత్తిచే రేకెత్తఁబడిన సత్తియే నీయల్లికకు మాఱాకై నది. దొడ్డబుద్ధులగు చదువరులీ నా తెగువను మన్నింతురు గాక!

ఈ పొత్తమును వినిపించుటకు వీలిచ్చి వారి మంచితలంపుల వెలార్చిన శ్రీ విజయనగర కౌముదీ పరిషత్తు వారికిని ఇంకను నితము సూపు విద్దెల ప్రోడలకును, దీని నచ్చొత్తించుటకు చేఁదోడు వాదోడైన సంగడీండ్రకును నా కైమోడ్పు లందించుచున్నాను.

రామభద్రపురము,
తే 25-6-1959 దీ

ఇట్లు విన్నపించు చదువరుల లెంక
బగ్గాం సన్యాసప్పన్నకవి.
(భాగవతార్)

---

# పీఠిక.

శ్రీ శివుని సాయుజ్యము నొందుటకు తిన్నని బత్తికంటె యుత్తమ సామగ్రి వేరొకటి లేదు. అనన్యమగు భక్తియే తిన్నని బత్తియనిఁ జెప్పఁదగును. తిన్నని భక్తి యట్టిది. తిన్నని భక్తియే తిన్నని బత్తిగా నిందు నిరూపితమైనది. కనుక దీనికి "తిన్నని బత్తి" పేరు సార్థకమైనది.

ఈ "తిన్నని బత్తి"ని అచ్చ తెలుఁగున సంతరించిన శ్రీ బగ్గాం సన్యాసప్పన్న కవి భాగవతులు నాకు ప్రియమిత్రులు. సహజమగు సంగీత, కవిత్వజ్ఞానముఁ గల్గి చిన్నతనమునుండియే పెక్కు కృతులను రచించి భక్తజనులయు, విద్వత్కవులయు ప్రశంసల నందియున్నారు. స్వయముగ రచించిన భాగవత కథలను సంగీత, తాళ, లయాన్విత, సాహితీ మధురముగ పెక్కు సభలందు ఆడి, పాడి ప్రదర్శించుచుండుట నే నెఱుంగుదును. పద్యరచన యందును, గేయరచన యందును సామర్థ్యముఁ గలిగిన కవులు లోకమున నరుదుగానుందురు. వీరికి రెంటి యందును సమానమగు సామర్థ్యమున్నది. ఆ రచనల రెంటినిఁ గూడ నీ కృతియందు పాఠకులు గుర్తింపఁగలరు.

అచ్చ తెలుఁగు రచనలు కొఱవడిన ప్రస్తుత కాలమున కూచిమంచి తిమ్మనాది కవివర్యుల ననుసరించి యీ కృతిని వీరు చక్కని యచ్చ తెలుఁగునందు రచించుట ప్రశంసార్హమైయున్నది. గద్య, పద్య, గేయ సంకలితమగున ల్లోక గ్రంథమును సమగ్రముగ నచ్చ తెలుఁగున రచించుట సులభసాధ్యము

కాదు. ఈ రచన తిన్నని చరిత్రమునకు తగియున్నది. చెంచు కులమునఁ బుట్టిన తిన్నని పలుకులను వెలువరించుటకు తత్సమ బహుళమగు ఆంధ్రభాష కంటె సులలితమగు నచ్చతెలుఁగే మిగుల నుపయుక్తమని వీరికిఁ దోఁచియుండవచ్చును. నాగరిక జనుల భాషలయందుకంటె పల్లెజనుల భాషయందు అచ్చ తెలుఁగు పదములు విస్తరించి యుండుట విజ్ఞులకుఁ దెలియనిది కాదు. కనుక నీ రచనయందు శ్రీ కవిగారు భాషౌచిత్యము నిట్లు పాటించుట మిగుల సముచిత మగుచున్నది.

తిన్నఁడు చెంచుదొర పట్టి 'ఎచటన్ జూడని వెట్టిబత్తి' అతని కెట్లబ్బెనో తెలియదు. కాలుష్యము లేని భక్తియే పరమ శివునకు ప్రీతిపాత్రమనియు, డాంబిక నియమయుక్తమగు భక్తి పరమేశ్వర ప్రీతిపాత్రము కాదనియు తిన్నని తిన్ననిభక్తివలన నిరూపిత మగుచున్నది. కొన్ని అచ్చతెలుఁగు కావ్యములవలె గాక యీ కావ్యము ప్రసన్నములగు అచ్చతెలుఁగు పదములను గలిగి యుండుటవలన నీ కృతి పాఠకులకు సులభావబోధ మగుచున్నది. తిన్నని నోట వెలువడిన నీ భక్తిసూక్తు లందలి తిన్నఁదనమును సమీక్షించునది—

"ఉ. ఈ కఱకుట్లు కమ్మఁదన మించుక లోఁపమా? కాల్పు చాలదా?
ఏకివి మాడెనా? నమల లేనటు లున్నవ? చిన్నవైనవా?
నీకివి నచ్చలేద? మఱి నే నిడఁజాలినవాఁడఁ గాన? నీ
యాఁకటి ప్రొద్దు మీఱెనద? అప్ప! కడుంగడు వేగఁ దెల్పవే!"

భక్తిమహత్త్వము ముందు నియమములును, ధర్మములును నిలువఁజాలవను నంశము కవి యిందు చక్కఁగా నిరూ-

పించెను. దీని కుదాహృతముగా క్రింది పద్యమును జూచునది.

"సీ. నిక్కపు బత్తియు, నొక్కండె వేల్పను
తలఁపును, దమ్మమ్ముఁ దప్పమియును,
కల్లలాడమియును, కలఁకఁ బారని మది
నందఱి నొక పోల్కి నరయుటయును,
కోర్కులఁ బోనాడి గొల్చుచుండుటయును,
నేను, నీవను బుద్ధి మానుటయును,
సందియ మెపుడు నాయందుఁ బొందమియును,
నోరిమితోడఁ జెన్నారుటయును,
గీ. నెవ్వఁడలరెడు నతఁడిచ్చ నెద్దియైనఁ
గుడుతు మిక్కుటమైన ప్రేముడినె తలఁచి
కొలము, బెలమును కొద్దియు న్గొప్ప నాకుఁ
గలదె, బత్తియు, గొనములఁ దలఁతుఁగాని"

మఱియు నీ గ్రంథమున గద్యరచనయు, గేయరచనయు పద్యరచనకుఁ దీసిపోని కూర్పునే గల్గియున్నవి. "అయ్యో! తినవేమయ్యా! వీనిని" మున్నగు గేయములును, "ఇట్లు సని చని ముందటు" అనువచనమును సమీక్షించునది.

మఱియు సాయంసమయ వర్ణనాదు లిందు లలితభావములతో వెలార్పఁబడి యున్నవి. రచన సుస్పష్టమగు సమన్వయముఁ గల్గి, ప్రసన్న పదకలితమై, ప్రశస్త భావములతో ధారాశుద్ధిఁ గల్గి తెలుఁగు జిలుఁగును వెలయించుచున్నది. విస్తరభీతిని రెండు పద్యములను మాత్రమే యుదాహరింతును.

"తే. మూఁగచేఁ గైతఁ జెప్పింతు; మొదటివేల్పు
నైన నోరాడ నీవన నబ్బురంబె?,

జాలిఁగాని నన్నుఁగను తమ్మిచూలి కొమ్మ!
పల్కులం దెప్పుడున్ సాయపడగదమ్మ!”

“క. బుడిబుడి నుడువుల బుడుతం
డెడ నెడ నుడువుచును, మీఁది కెగఁబ్రాకుచు, చి
ట్టడుగులు వేయుచు, నడచుచు,
వడిగాఁ బరువెత్తఁజొచ్చె వరుసగ నంతన్.”

శివభక్తులకీ గ్రంథము మిగుల నాదర పాత్రము కాగలదని తలఁతును. ఈ గ్రంథమును కావ్యముగా పఠించుకొనుటకు వీలగునట్లును, హరికథా కథన కుశలులు పాడుకొనుటకు వీలగునట్లును, గద్య పద్య భాగములను మొదటనుంచి వాని క్రింద నేతద్భావములు గల గేయములను పొందుపఱచుట యీ గ్రంథమందలి నూతన విశేషమైయున్నది.

సహృదయ భక్తులగు పాఠకులు “తిన్నని బత్తి”యందుఁ గల తిన్నని బత్తి నలవఱచుకొని శ్రీ పరమేశ్వర కృపాకటాక్షమునకు పాత్రులగుదురు గాక! ఆంధ్రభాషా విశారదులగు శ్రీ సన్యాసప్పన్న కవివర్యు లిట్టి సద్గ్రంథములను రచించుచు నాయురారోగ్య భక్తి విజ్ఞాన సంపద్విలసితులై వెలయుదురు గాక! అని సర్వేశ్వరు నభ్యర్థింతును.

ఇట్లు,
విద్వద్విధేయుఁడు,

భారతీ తీర్థ కౌముదీపరిషత్
విజయనగరము
24-10-1959

పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
ఆంధ్రభాషా ప్రధానాధ్యాపకుఁడు
ప్రభుత్వ మహారాజా సంస్కృత
కళాశాల, విజయనగరం.
భారతీ తీర్థ కౌముదీపరిషత్ సాహిత్యసమితి సభ్యుఁడు.

# పండితాభిప్రాయములు

విద్వాన్ శ్రీ దివాకర్ల రామమూర్తి M. A.,
Head of the department of Vernaculars
A. V. N. College, Visakhapatnam
గారొసంగిన అభిప్రాయము.

ఆంధ్రభాషా విశారద శ్రీయుత బగ్గాం సన్యాసప్పన్న కవిగారిచే నచ్చతెనుంగున ముచ్చట లొలుక తీర్చిదిద్దంబడిన "తిన్నని బత్తి" యను కబ్బమును జదివి తనివి నొందితిని. ఈ నాళ్ళ నచ్చతెనుఁగు కబ్బములకు విద్దెల కొలువులలో నుద్దిక మీఱిన తానము రిత్తగానున్నది. అయినను మేరమీఱిన తెనుఁగు పలుకుఁబడులయందలి నుడికారముల దొణుకు తేనెలఁ గ్రోల నువ్విళ్ళూరు చదువరులు లేకపోలేదు. అట్టివారికొఱకీ కబ్బము సొంపార గుదియింపఁ బడినది.

పుట్టుకతోడవచ్చిన పలుకుల వెలంది కొలువు కూటపు నిలకడ వలదు పొమ్మన్న పోవునదికాదు. మెచ్చము వలదన్న కుంటువడునదియు కాదు. పైడి కలుపులు లేనిదైన తోమిన కొలంది మెఱుంగుల నీనును. ఇత్తడికి తళుకులు రావు. వచ్చిన వెంటనే కగ్గిపోవును. పద్దెముల నెత్తుకడలో, కతను వెలయించుటలో, కతలోని మెలకుల నెఱి దిట్టతనమున తలకొనునట్లు చేయుటలో నీవ్రాఁతకాఁడు చూపిన పసితనము వెలకట్టరానిది.

ధూర్జటి మున్ను తిన్నని కత చెప్పి కొండంత కీరితి నొందె. అది యచ్చతెనుంగునఁ గాకుంట నీతనికి తెనుంగుఁదనంబును వరదగొట్ట పారించి చదువరుల మేనులఁ గగుఁర్పొడి

పింప జతనము కలిగియుండు. ఆ జతనమున నీతనితోడ నెవ్వరు సరి రారనవచ్చు. పలువురు చదువరులు పలుకుల పరువములఁ దెలిసిన ప్రోడలు దీనిఁ బెరిమమతోఁ జదివి మేలు మేలన్న యీ పనివాఁడు కలుకులొందును.

జేజేలపెద్ద యీతనికి సుగముల నొసంగి మేలుజాతి కబ్బములఁ గూర్చు చేవ నొసంగుగాత మని యెద తలపోయు నట్టి పలుకుల వెలంది లెంక,

విశాఖపట్టణము,
తే 16-8-1959 దీ.

దివాకర్ల రామమూర్తి.

---

శతావధాని, శ్రీ మాడుగుల వేంకట సూర్యప్రసాదరావుగా రొసంగిన అభిప్రాయము.

క. మాన్యతరకీర్తి! బగ్గాం
సన్యాసప్పన్న సుకవి! సకల విబుధ స
మ్మాన్యస్థితిఁ దిన్నని కత
ధన్యమతిన్ రచన సేసి తనరితివి బళీ!

క. చెన్నుగ నచ్చ తెనుంగున
తిన్నని కత కబ్బమల్లి తేజొందిన నీ
పన్నని కైతల నేరుపుఁ
బన్నుగడన్ బొగడఁదగదె? పలుబలుకులతోన్.

ఇట్లు,

శ్రీకాకుళ ధర్మవరము,
తే 3-7-1959 దీ.

మాడుగుల వేంకటసూర్యప్రసాదరావు
శతావధాని.

మ॥ రా॥ రా॥ శ్రీ ఆంధ్రభాషావిశారద, బగ్గాం సన్యాసి అప్పన కవివర్యుడు, తన తిన్నని సచ్చరిత్రమును సాంతముగ నాకు వినుచుటను, విని సంతసింపఁ గల్గితిని. ఆనా సంతసమును వెలువరింప నెంచి, కొన్ని పద్యములతో నా యాశయము నిరూపించుచుఁ గవివర్యు నాశీర్వదించితిని.

క. సంసార దూరగతులఁ బ్రి
శంసార్హము; తిన్నని విలసచ్చరితము; ని
ష్పాంసుల గతి వ్రాసిన బ
గ్గాం సన్యాసికవిరాజు; కడు వర్ధిలుతన్.

ఉ. తిన్నని శైవభక్తిగల తిన్నని సచ్చరితమ్ము; తెన్గు బా
స న్నిపుణమ్ముగాఁగవులు సంతసిలన్, రచియించి; వాణికిన్
వన్నెయు వాసిగల్గ నవ పల్లవ కోమల యక్షగానముల్
మిన్నగ నెన్నొ వ్రాసితివి మెచ్చుగ నిట్టివి వ్రాయుమో కవీ!

ఆ. వె. గద్యరచన తేనె కాలువమై జాఱఁ
బద్యరచన మేలి పంచదార
పంచదార తేనెలుంచిన యిద్దానిఁ
జదువ తృప్తిగలుగు సత్కవులకు.

ఆ. వె. నాటి ప్రాఁత తెన్గు బాటలఁ గనుగొంటి
నేటి నీదు బాస నూటి గంటి
సాటి లేనియట్లు సాగను నీకైత
కవివరేణ్యా వృద్ధి గనఁగదయ్యా!

క. యువకుఁడ వుపదేశికుఁడవు
కవితకుఁ గల పరికరాలు గలవాఁడవు; నీ
వవును ఇఁక మఱియు సత్కవు
లవుననఁ దగినట్టి కబ్బ మల్లగ సుకవీ.

ఇట్లు
విద్వత్కవి, విశాఖాంధ్రోపాధ్యాయుఁడు-
ఆకుండి వేంకటశాస్త్రి.

---

కవికోకిల, శ్రీ ఆవంత్స వెంకట రంగారావు, B. A., B. Ed.
గారొసంగిన అభిప్రాయము.

సంగీత సాహిత్యములు సరస్వతీ దేవి స్తనద్వయమనియు, మొదటి దాపాత మధురమనియు, రెండవది చింతనామృతమనియుఁ బెద్దలు వర్ణించి సంగీత సాహిత్యముల యొక్క పవిత్రతను, ప్రత్యేక లక్షణములను, అవినాభావసంబంధమును నొక్కివక్కాణించినారు. శ్రీ సన్యాసప్పన్నగారి పూర్వులు వ్రాయఁగా వ్రాయఁగాఁ గరణములైనారు. వీరు వ్రాయఁగా వ్రాయఁగాఁ గవులునుఁ బాడఁగా బాడఁగా హరిదాసులుగను గూడ నయి వేదికలపై హరికథలు సెప్పి ఆపాతమాధుర్యము గల గానామృతమును, ఆలోచనా సంయుతమైన సాహిత్యామృతమును శ్రోతలకుఁ బంచియీయఁగల శక్తిమంతులైనారు.

ఇట్టి శక్తులును, అచ్చ తెనుఁగు పాండిత్యమును గలవారు గనుగ శ్రీ సన్యాసప్పన్నగారు పద్య గద్య గేయాత్మకముగ

'తిన్నని బత్తి' యను నీ యచ్చ తెనుఁగు సత్కావ్యమును సంతరించి తిన్నని పాత్రనుఁ జక్కగ బోషించి ధన్యులైనారు. గద్య పద్య సంయుతములైన కావ్యములనుఁ జంపువు లందురు. గద్య పద్య గేయ సంయుతములైన యిట్టి కావ్యముల నేమన వలెనో ?

"ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాపి తన్ముఖమ్" అను సంస్కృతాలంకారికుల నిబంధనము ననుసరించి మన కవిగారు ఈ కావ్యారంభమున బేసికన్నుల వేల్పును స్తుతించి తన శివభక్తిని దిన్నని శివభక్తి యనెడు కావ్యవస్తువును గూడ సూచించినారు. ప్రాచీనాంధ్ర కవుల యాచారమును బాటించి షష్ఠ్యంతములతోఁ బద్యములు రచించినారు. గాని గ్రంథాదిని శ్రీకారము లేమి అద్యతనకాల కవులలక్షణ మనిపించును.

ఇంపులుగొల్పు తేఁట తెనుఁగు నుడికారపు సొంపుతోఁ బ్రసాదగుణముతో, ధారాశుద్ధితో నొప్పుచున్న యిట్టి కావ్యములు వేనవేలు రచించు శక్తి భగవంతుఁడు వీరికిఁ బ్రసాదించు గాత!

విజయనగరం,<br>శార్వరి జ్యేష్ఠము<br>(జూన్ 1960)

ఇట్లు,<br>బుధజనవిధేయుఁడు,<br>(సం) ఆవంత్స వేంకటరంగారావు

శ్రీ విజయనగరం మహారాజావారి కళాశాల అధ్యక్షులును,
శ్రీ కౌముదీ పరిషదధ్యక్షులును నగు
శ్రీ వసంతరావు వేంకటరావు, M. Sc. గారొసంగిన
అభిప్రాయము.

---

ఆంధ్రభాషా విశారద శ్రీ బగ్గాం సన్యాసప్పన్న కవిగారు వ్రాసిన "తిన్నని బత్తి" యను కావ్యమును వారు చదువగా తనివితీర విని యానందించు భాగ్యము నాకు కలిగింది. అనేక విధాల ఈ కావ్యం ప్రశంసార్హ మైనది. అచ్చ తెలుగులో చక్కటి, చిక్కటి కవిత్వ మిందులో ఆద్యంతం గోచరిస్తుంది. కథావస్తువు భక్తిప్రాధాన్యాన్ని విశదీకరించు తిన్నని చరిత్ర. రచనా విధానం నవీన ప్రాచీన శయ్యా సమన్వితం. పద్యాలు మృదుమధుర మైనవి. హరికథగా కూడ దీనిని వినియోగించుకోడానికై పాటలు కూడ కవిగారు చేర్చేరు.

ఈ రచన కౌముదీపరిషత్సమావేశములో పూర్తిగా విన్పించి కవిగారు సభ్యులకు ముక్తిమార్గాన్ని చూపేరంటే అతిశయోక్తి కాదు. ఈ కాలంలో భక్తికెంతైనా ప్రాముఖ్య ముంది. హృదయాన్ని సులభంగా స్పందింపచేసి ముక్తి మార్గంలో పెట్టగల శక్తిసామర్థ్యాలు భక్తికే ఉన్నాయి. అట్టి భక్తిభావాన్ని పండిత పామర జనరంజకంగా పాఠకలోకాని కందిచ్చిన కవిగారు ధన్యులు.

విజయనగరం,
తే 15-6-1960 ది. } (సం) వసంతరావు వేంకటరావు.

‘తిన్నని బత్తి’ యను నీపొత్తము నచ్చొత్తించుటకు
సాయపడిన విద్దెల విలువెఱింగిన పెద్దలు.

1. శ్రీ చలుమూరి సింహాద్రప్పలనాయుడుగారు, ...116-00
(చందరిమ్మపేట)
వైస్ ప్రెసిడెంటు, గంట్యాడ బ్లాక్ పంచాయితీ సమితి.

2. శ్రీ వేచలపు చినవేంకటరామయ్యగారు రు. 50-00
(పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు, నీలకంఠరాజపురము)

3. శ్రీ వేచలపు సింహాద్రిప్పలనాయుడుగారు ... 50-00
(పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు, వేచలము)

4. శ్రీ వేచలముగ్రామ పౌరులు ... 85-00

5. శ్రీ గొర్లె క్రిష్ణంనాయుడుగారు ... 30-00
(పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు, అలమండ)

6. శ్రీ అవగడ్డ సత్యాదినారాయణమూర్తిగారు ... 30-00
(గ్రామ మునసబు, మారేపల్లి)

7. శ్రీ వేచలపు అప్పలపాత్రుడుగారు ... 20-00
(నీలకంఠరాజపురము)

8. శ్రీమతి రెడ్డి ఎఱ్ఱయ్యమ్మగారు ... 20-00
(తారువగ్రామం)

9. శ్రీ డోకుల సింహాచలము నాయుడుగారు ... 20-00
(తారువ గ్రామము)

10. శ్రీ గండి వేంకటరామయ్యగారు ... 5-00
(పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు, వావిలపాడు)

11. శ్రీ భూమిరెడ్డి జగన్నాథముగారు, (వావిలపాడు) 5-00

12. శ్రీ కాకర కృష్ణమూర్తిగారు ... 5-00
(డొంకాడ అగ్రహారము)

# మేలు పలుకు

ఉ. 'తిన్నని బత్తి' యందుగల
తీయని తెల్గుపసందు నెంచి దా
మన్నన నచ్చువేయుటకు
మంచితలంపున సాయపడ్డ నా
యన్నల కన్నికల్ములన
హా! యన నెల్లపుడిచ్చి మీఁదటన్
తిన్నని బత్తి ముత్తులను
దెబ్బునఁ గూర్పఁగ నెంతు నీసరున్.

ఇట్లు,

నుడికూర్పరి.



శ్రీ బిగ్గాం సన్యాసప్పన్న కవిగారు

ఓం నమశ్శివాయ.

ఓం శ్రీ సుబ్రహ్మణ్యస్వామినే నమః.

# తిన్నని బత్తి

(అచ్చ తెలుఁగు)

చ.1 ఒకతెను నెత్తిఁ బెట్టుకొని - యొక్కతె మేన సగాన నిల్పి, వా
రికిఁగల చీలికయ్యముల రేఁపుచు మాన్పుచుఁ, గారవించుచిం
కొలదిన వేల్పు జోగిగమి నొప్పుగ సాఁకుచు, వేడ్కమీఱు, బే
సికనుల వేల్పు నెంతు మదిఁ జెంగటఁ దోఁచి తలంపు లీయఁగన్.

ఆ.2 తెలివి లేమి "నేను సలిపెద నీపని"
అనుటెగాని; బమ్మయైన తుదకు
గుజ్జువేల్ప! నీవు కూరిమి వీడినఁ
గదలఁగలఁడె! మేలు గాంచఁ గలఁడె!

తే.3 మూఁగచేఁ గైతఁ జెప్పింతు; మొదటి వేల్పు
నైన నోరాడనీవన నబ్బురంబె?
జాలిఁ గొని నన్నుఁగను తమ్మిచూలి కొమ్మ!
పల్కులం దెప్పుడున్ సాయపడగదమ్మ!

---

## 1 కామవర్ధని — చతురశ్రగతి.

1. ప. తడయకెపుడు తో - డ్పడు ముక్కంటీ॥ త॥
అ. అడుఁగుల మదిఁ గొని - యాడెదఁ బాడెద॥ త॥
చ. చెడునడతలఁ గల కొడుకులఁ దండ్రులు
విడుతురె తామెన్నఁడుఁ గాపాడక
నడతల నుడువుల నాతప్పులెన్న
వెడఁదఁ దలంపక నీదరిఁ జేర్పర॥ త॥

## —: నుడికూర్పరి పుట్టువు :—

సీ. గౌడపారులఁ దెల్వఁ గా౦ిలి ఒడ్డాదిలో
శిష్టకరణములు చెలఁగు చుందుౘ్రి
తెలునాటను నలుదెసల రాచ:కంపు
పనుల నేర్పరులుగా వలసవచ్చి
తెల్గువారై కడు దిట్టరులై రందు
బగ్గాము వారు సొంపార మంచి
యొజ్జలై విద్దెల నొప్పుగా నేర్పుచు
మన్ననలను బొంది రన్నియెడల
నట్టి వారల 'రామజోగయ్య' వెలసె
నెలమి యొజ్జలలో మేటి యాతఁ డనఁగ
మొదటి పట్టి వానికి 'రామమూర్తి' యగుచు
పాల వెల్లికి జాబిల్లి పగిదిఁ బుట్టి

---

౧. కనుఱెప్పపాటుగా నీ జగముల
మొనసి యొక్కతటి లోపల నిడుకొని
వెనువెంటనె పైఁబెట్టుట నీకొక
తనివిఁ జెందఁగాఁ దగు నాటగాదె!
నినుఁబొగడఁగ బెనుమినుకులె చాలమి
నే నెంతవాఁడ నిక్కపు మొద్దను॥ తి॥

2 కాఫీ — ఆదితాళము.

ప. తొలి దేవర నీ యడుఁగుఁదమ్ముల నెద
నిలిపెద నా తప్పుల మన్నింపర॥ తొ॥
అ. తలఁచిన పనుల ఫుల్లుల నడ్డువేయఁ
దలఁచినచో నేనెంతటి వాఁడర॥ తొ॥

క. ఆతని మామగు 'శేషయ'
కూఁతును 'నారాయణాంబఁ' గొని యొకనిని నన్
బ్రోఁతిగఁ గని మూఁడేండ్లగు
నాతఁడి వినుపోలి కరిగె నకటా! యనఁగన్.

క. ఆ నాటి నుండియును నను
'మానాపుర రామమూర్తి' మానుగఁ బెంచెన్
మేనల్లుఁడ నగుటను నా
మానిసి తలమానికంబు మాఱాకు బలెన్.

తే. సాజమగు కైత మది సంతసంబుఁ గనుచుఁ
గొన్ని పాత్త్రములను వ్రాసి గొప్పవారి
చెలిమి కలిమిని వెలసితి, పిలుతు రెల్ల
రరసి 'సన్యాసిఅప్పన' యనుచు నన్ను.

—: అప్పగింత :—

క. వెన్నుని చెలికానికి, తిగ
కన్నుల వేల్పునకు, బూచిగమిరాయనికిన్,
మిన్నేటి తాల్పునకు, నా
తిన్నని వెసఁ బోలిచినట్టి దిసమొల దొరకున్ ౧

క. చుక్కలదొర తాలుపునకు,
జక్కులదొర చెలికి, మేటి జడదారికిఁ, బెం

౧. ఎల్లవిద్దెలకు నొజ్జ వీవనుచు
చెల్లరే! తొలిచదువులెల్లఁ బల్కెర
బల్లిదంపు నేర్పు నొసఁగి కైతల
నల్లునెడల నాకు సాయపడరా! తో॥

పెక్కైన సుగములు బత్తుల
కక్కఱగలయప్పు డొసఁగు సయ్యాసరుకున్. ౨

క. వలిమల యల్లునికిన్; రి
క్కలరాయఁడు, వేఁడివేల్పు, గాములదొర, క
న్నులుగా గల దఱికిన్; పా
ముల తొడవులు దాల్చు నైదుమోముల దొరకున్. ౩

క. మినుసిగపై లేనెలయును
వినువాకను దాల్చి మంచి వెల్లని యాబో
తును నెక్కి బూచు లెల్లను
తను నిత్తెముఁ గొల్వ వెలయు దయ్యంబునకున్. ౪

---

## ౩ కేదారగౌళ — ఆదితాళము.

ప. పలుకుల వెలఁదీ! నిలువుము నా మది॥ ప॥

అ. ఎలమి వేల్పుపెద్దకు నిల్లాలవు
ఎల్లచదువులకు నీవే తావువు॥ ప॥

౧. కలముఁబట్టి తలఁపుల బైటఁబెట్టఁ
గలరెవ్వరేని నీ వూరకున్న
పలుకఁగలనె నీ గొప్పతనమ్ముల
తెలివిలేనివాఁడను పసినిసువను॥

౨. బళి నిన్ను గొలుచు వానికిఁ గొదువే
పలుకులఁ దేనియ లొలుకఁ జేయవే
చెలువొందఁగ చుక్కలు చందురుండుఁ
గలదనుక నాదు కబ్బము నిలుపవె॥ ప॥

క. పెను మిన్కు లీను వేలుపు
పునుకను వలకేలఁ దాల్చి ముమ్మొనవాలున్
గొని బిచ్చమెత్త నేఁగుచు
ననయము బత్తులను బ్రోచు నా జంగముకున్. ౫

క. వెలిమల యిల్లును, బలిసిన
వెలి పసరము వారువమ్ము, వెలి సిగపువ్వున్
వెలిమిడి మెయి పూతయుఁ గల
వెలివలిమలయల్లునకును వెలివేల్పునకున్. ౬

వ. ఇట్లు మది నిచ్చగించు వేల్పులం గొనియాడి నా యొనర్పం బూనిన కబ్బమ్మునం గల కత తెఱం గెట్టిదనిన.

మ.1 తెలుఁగుంగడ్డకు మిన్నువాకనఁగఁ దాఁ దియ్యంపు నీటన్ దగన్
పొలముల్ నింపుచు మేనితాల్పులకు నెప్డున్ సేమమున్ గూర్చుచున్
వెలయున్ బంగరుమోము టేఱు; సరసన్ విన్నాణమై బోయ ప
ల్లెలకున్ మానికమౌచు నూరొకటి పేర్మిన్ వెల్గు నుడుమ్మూరనన్.

---

మంజరి — మోహన (ఒకటినుండి ఆరు పద్దెములకు బదులుగా)

౧. మునుపు బంగారు మొగపు టేటిదాపున బోయపల్లియలకు
కనులపండువై దనరెడు "ఉడుమూ"రనెడు వీడు కల్మిలకు॥

౨. అమ్మేటివీటి "నాగన్న" యనెడు నాతం డేలిక యగుచున్
నెమ్మిని "తండె"ను రాణిగఁ జేకొని నెఱె నెల్లసిరులఁబొలుచున్॥

3. ఆ యాలుమగలు ముక్కంటి బత్తి బాయని పున్నెమునంగన్
బోయల తలమానికమై "తిన్నఁడు" పుట్టె కొలము దనియంగన్॥

౪. పుట్టుచేవతోఁ బొల్పారుచు నా బుడుతఁడు బెఱుఁగఁగఁజొచ్చెన్
దిట్టరియై విలువిద్దెను కవ్వడి దిగనాఁడు మగలు మెచ్చన్॥

చ.2 సికులకుఁ దావలంబగుచు, చెన్నుగ పూవులఁ బండ్లతోఁ దలలన్
నెఱవగు నీటిబావులును, నింగినిఁ దాఁకెడు పెద్దమ్రాఁకుల
క్కరణిని సాజకల్మల చోకాటఁపు వన్నెల యాలమందలున్
తిరమగు కట్టడంబులును, నీటగు బాటలుఁగల్గి యొప్పెడిన్. ౨

శా.3 చెంచుంబల్లెల కెల్ల తేఁడగుచు నే చీకాకు లేకెప్డు యో
చించున్ నీసకు బత్తిఁ జేకుటకునై చేతల్ తలంపుల్ నివా
నించున్ వేఁడుక నిక్కపుం దెలివుసన్ నిత్తెమ్ముఁ బోనెంచుచున్
మంచిన్ గోరెడు రాచదమ్ములతో 'నాగన్న' తానొప్పెడిన్.3

తే.4 'తందె' యను పేరఁ బరగుచు, సందగత్తె
లందుసన్ మిన్నయేగాక అన్ని గొనపు
లందు నెన్నికఁ గన్నదై యలరు నతని
రాణి, పూబోణి, మేలా వరాలగోణి. ౪

సీ.5 వేకువనేలేచి యేకొఱంతయు లేక
సాజంపు టలవాట్లఁ జక్కపెట్టి
తానమాడి పబుని తానకముం జేసి
నీటుగా మంచి పన్నీటఁ గడిగి
తావు లీనెడు విరిదండలఁ గొన్నింటి
సమకూర్చి ముక్కంటి సరసఁ జేరి
బత్తితోఁ గైసేసి పలురకంబుల పండ్లు
జుంటితేనియ, పాలు జోక నొసగి
అలుమగ లిర్వురుంగూడి కేలుమోడ్చి
కోరి వేల్పు పసాదము నారగించి.
తనివిఁ గొని, పెన్కఁ దా రాచపనులయందుఁ
బూన్కి నిల్పుచు 'నాగన్న' పుడమి జేఁడు. ౫

కం. ఆ యాలు మగలు నిత్తెము
వాయని ముక్కంటి బత్తి పండె ననంగన్
బోయల తలమానికమై
హాయిగ నొక పట్టి 'తండె' కాదటఁ గలిగెన్. ౬

తే. బంధుగులు, చెలుల్, చుట్టముల్ బలసి కొలువ
పురిటి సుద్దిని బిడ్డకు గురుతుఁగాఁగ
బేర్మి 'కన్నప్ప'యను పేరుఁ బెట్టి పిదప
అడుగువారల కోరిక లిడిరి వరుస. ౭

తే. పిండివంటలు, నంజుడుల్, పెరుగు, పాలు,
జుంటితేనియ జుబ్బన చూఱ గాగ
మెక్కి తీయని కలుఁద్రావి మేళ తాళ
ములను నాడిరి చెంచులు చెలిమి వెలసి. ౮

ఆ. పుట్టుచేవ యనెడు పోల్కి నా బుడుతఁడు
పెఱుఁగఁజొచ్చె తెవులు నెఱుఁగకుండ
జ్యోతి వెల్గునట్లు లాతఁడు గీమున
వెలసె తల్లిదండ్రు లలరుచుండ. ౯

కం. బుడిబుడి నుడువుల బుడుతం
డెడనెడ నుడువుచును, మీఁది కెగఁబ్రాఁకుచు, చి
ట్టడుగులు వేయుచు, నడచుచు,
వడిగా బరు వెత్తఁజొచ్చె వరుసగ నంతన్. ౧౦

తే. తోడివారలతోఁ గూడి వేడు కలర
ఆటపాటలలో మేటియగుచు వెలయ
కన్నబిడ్డకు విద్దెల గఱపఁ దలఁచి,
యొజ్జలన్ బిల్చి నాగన్న యొయ్యఁ బల్కె. ౧౧

తే. ఇతఁడు పసిబిడ్డఁ డైదవయేడు వచ్చె
వీనిఁ జేకొని విలువిద్దె, వేట, సాము,
చదువు నేరిపి, కొనిరండు సనుఁడటంచుఁ
గానుకలిడి యొజ్జలకు మ్రొక్కి గారవింప. ౧౨

క. వల్లె యనుచు నా యొజ్జలు
బల్లిదుఁడగు చిన్నవాని, బసదనమును వా
రుల్లము పొంగఁగఁ దోడ్కొని
చెల్లరె! యన విద్దెల్లెఁ జెప్పఁగ నతఁడున్. ౧౩

సీ. సింగంపు కొదమచు జెండాడు మఱియొక
యమ్ముఁ గూర్పక నొక యమ్ముతోడ
ఒంటరి పందిని వెంటాడి పడఁగూల్చు
బాకు చేఁగొని తడబాటులేక
వినువీది నురవడిఁ జను పక్కిగమినిఁ దాఁ
దలఁచు నొకండ నేర్పలరఁ గొట్టు
మెకములఁ గంటఁ గానక నెంత దవ్వైన
సడి విని కోలను విడచి గూల్చు
ఎన్నఁడైనను బాజేటు మెఱుఁగ డతఁడు
వేటయందున జగజెట్టి, మేటి మగఁడు
తోటివారల సాయమెంచును దలఁపఁడు
ముక్కునకు సూటిగా పనుల్ సక్కవెట్టు. ౧౪

సీ. 2 కన్నవారిని, విద్దె గఱపువారిని వేల్పు
కైవడిఁ జూచును, కలత మెఱుఁగఁ
డన్నల మిన్నల నరయుఁగా నెంచఁడు
వన్నెకాఁడైనను కన్నులెత్తి

తనవారు, పెరవార లను బుద్ధి తలపోయఁ
　　　　డందఱ నెచ్చెలు లట్లుఁ గాంచు
నొరుల కీయక నెద్దియును దిననొల్లఁడు
　　　　లేదనఁడెరికి వాదు సేయఁ

బూనఁడెప్పుడు తిన్ననిబుద్ధిఁగల్గి
వరలుచుండుట నాయూరి వారలెల్ల
తిన్నఁడని వేడ్కఁ బల్కుచు నున్నకతన
నద్ది పరిపాటిపేరు కన్నప్ప కయ్యె. ౧౫

సీ. తానేయు మెకములఁ దడయక ముక్కంటి
　　　　కప్పనంబుగ నిచ్చు, నాటపాట
లందున నెడయక నరపదిమోముల
　　　　వేలుపుఁ బాడుచు వేడ్కమీఱు,
మిత్తిగొంగని బత్తి నిత్తెము నల్వెడు
　　　　వారలఁ గని యెడబాయకుండు,

---

2 కల్యాణి — రూపకము.

ప. తిన్నని నడవడికను గను - గొన్న వారి కబ్బిమగును॥ తి॥

అ. ఎన్నఁగ నాతనిఁ బొందిన - కన్న వారి పున్నెమగును॥ తి॥

మి. వన్నెకాఁడు మెయితాల్పుల - మన్నెదొరల చలువజేఁడు
కన్నెలఁ గన కన్నెత్తం - డెన్నఁడు కల్లలెఱుంగఁడు॥ తి॥

౧. పేదలఁగని విసువుటయును - పెద్దలఁగని యెడయుటయును
లేదని నోరాడుటయును - వా దొరుపైఁ బెట్టుటయును
నేదెస నైన నెఱుంగఁడు - ఎపుడు బత్తి విడనాడఁడు
తాఁ దినఁ డెపు డొరులకిడక - దమ్మము నించుక దప్పఁడు॥ తి॥

ఇసుకతో లింగని నేర్పారఁ గావించి
మిక్కిలి బత్తిని మేనుమఱచు
తిన్నని గొనమ్ములకుఁ బ్రోవు తిన్నఁడనఁగ
చెన్నలర నొజ్జలును వీటినున్న పజలు
మన్నెదొరఁ జేరి గొనముల విన్నవించి
పలుకఁదొడఁగిరి, సంబరంపడుచు నిట్లు. ౧౬

తే. 3 కేలుజోడించి పబువును కీరితించి
సామి! గొనముల వామి! నీవేమి పూజ
సల్పితో తొల్లి యీసకుసాటి కొడుకుఁ
గాంచితివి మాదు బాగెముగాదె! అదియు. ౧౭

తే. ఎదుట నిచ్చకమని మది నెంచఁబోకు
మతని గొనములు మాబోటు లరయఁగలరె!
అయిన మాబుద్ధి నెంచిన యంతవఱకు
విన్నవింతుము వేడ్కతో వినుము తేఁడ. ౧౮

ఉ. ఆటలకైన బొంకులను నాడఁడు నెల్లరఁజూచు ప్రేముడిన్
బోటులనెల్ల తల్లులని బుద్ధిఁ దలంచును, దమ్మమించు కే
నాటికిఁ దప్పఁడెందునను నాయను నీయను వేఱిమేమి లే
దేటికి వేయిఁదెల్ప నతఁడీసరుఁడేసుమి మమ్మునేలఁగన్. ౧౯

---

3 బెహాగ్ — చతురశ్రగతి

(16, 17, 18, 19, 20 పద్దెములకు బదులుగా)

ప. సామీ! గొనములవామీ! వినుమా॥ సా॥
అ. మా మనవిని నెమ్మది నిటు గనుమా॥ సా॥
మి. ఏమినోములం దొలిపుట్టువునం-దీవానరించితో నచ్చెరువయ్యెను
నేమేమి పున్నెమొసరించితిమో-ఇట్టిబుద్ధిగల తేనిఁబొందితిమి॥సా॥

తే. ఇర్వదేడేడు లాతని కీడువచ్చె
రాచఱిక దమ్మముల నేర్చె రహిని మమ్ము
నేలఁగలవాఁడు తిన్నఁడో నేలతేఁడ!
రాచగద్దియ నెక్కింపరాదె యింక? ౨౦

క. అని తన పట్టిగొనమ్ములఁ
గొనియాడిన పజలు దనియ, గొబ్బున వీటిన్
వెనువెంటనె సింగారిం
పను లెంకల గానవెట్టె పబు వబ్రిముగన్. ౨౧

వ. అట్లానతిడి, తన చెంచుతేడుల మరియాద ననుగమించి, యిల వేల్పగు కాటితేని నాటిరేయిఁ బూజించి, వేల్పు పసాదము నొందిన మీఁదట వేట సేయించి, అందు మేటి విలుకాఁడని మెప్పుగాంచిన పిమ్మటఁగదా రాచగద్దియ నెక్కించుటని పెద్దల రావించి మంచి మూరుతమడిగి కాటితేనిఁ గొల్చుటకు వలయు సంబారముల గ్రక్కున సమకూర్పుఁడని చెంచుపజల నెచ్చరింప వల్లెయని వారు కడుసందడిఁ గై మోడ్చి. ౨౨

ద్విపద:- పనిఁగొని సంతసంపడుచు నెల్లరును
వెనువెంట గీములు వీది వాకిళులు
రచ్చలు క్రింతలు రాచబాటలును
పచ్చని పందిళ్ళ బాగుగా నిలిపి

---

౧. ఆటలకైనను బొంకులనాడఁడు-అందఱినొకచూపునని త్రైముఁగను
బోటుల నెల్లను తల్లులని యెంచు-బుద్దిని కలకంతు నెపుడు మఱువఁడు
౨. ఏటికీతడవు యిర్వదేడేండ్లు - ఈడువచ్చె నిఁక మమ్మేలఁగలఁడు
కాటితేనిఁ బూజింపఁగఁ బంపుము - కడువడి మా కొడయనిగా
నిల్పుము॥ సా॥

కలయంపి సల్లిరి కస్తురి నీట
కలువదమ్ములు మేల్మి గంబాలఁ గట్టి
చెలువొంద గుమ్మాలఁ జివురుటాకులను
పలురకమ్ముల పూల పసుపుకుంకుముల
వెలయఁగఁ జేసి యువిదలెల్ల నపుడు
తెలినారపుట్టముల్ దిటముగాఁ గట్టి
పునుగు జవ్వాది సొంపుగ మేన నలఁది
ననలను దురిమి తిన్నని మెచ్చుకొనుచు
వెదురు బియ్యపు పిండి వెట్టిన కుడుము
లదనగు తేనెఁ జెన్నారెడు పండ్లు
జడలబత్తెల పాలు చాలరకాల
అడవి నంజుడులు నాహా! యనఁబట్టి
కాటి ఱేనికి బలిగా నొనరింప
మేటిగా క్రొవ్విన మెకములఁ బట్టి
తప్పెటల్ బాకాలు తద్దయు మ్రోయ
ఒప్పగు పాటల నొకరి నొకండ్రు
అనుగలముగ నుతి సరయుచుఁ బాడి
తనివొంద బోయలందఱు దేవళమున
కరుగ సాగిరి ఱేని యాన వెన్వెంట
కుకులను వింతరంగుల యీఁక లొప్ప
చెందిరపుం బొట్టు చెన్నారుచుండ
పొందుగా తెలిపట్టుపుట్టముఁ గట్టి
విల్లు నమ్ములు చేత వేడుకఁ బట్టి
తల్లిదండ్రులును సంతసమున రాగ

తిన్నఁడు ముక్కంటి దేవళమ్మునకు
వన్నెమీఱఁగ నేఁగి బత్తిఁ బూజించె
కన్నుల పండువుగా నాటి రేయి
వెన్నుని చెలికాని వినువకఁ గొల్చి
మరునాఁడు విందు నేమముగఁ గావించి
మరలిరి వీటికమ్మాడ్కి నెల్లరును
కొలువు కూటమ్మున కొమరునిఁ జూచి
పలువురు వినుచుండఁ బల్కె తేఁడిట్లు. ౨౩

క. 4 అన్నా! తిన్నా! ప్రజలను
మన్నించుట రాచపాడి మానుగ నిన్ని
మన్నెదొర రాచపీటను
గ్రిన్నన నెక్కింపఁ గొల్వుఁ గావించితి రా! ౨౪

---

4 కాంభోజి — చతురశ్రగతి

(24, 25, 26, 32 పద్యములకు బదులుగా)

ప. అన్నా! తిన్నా! ఆలింపు మిపుడు॥ అ॥
అ. మన్నె దొరలమగు మన దమ్మములను॥ అ॥
మి. మున్నేమి పున్నెమే మొనరించితి-మో నినుగంటిమి ముక్కంటి
దయచేను। ఎన్నఁగ నీ కెఱుఁగరాని దమ్మము - లెవ్వియగల్గు నైనఁ
దెల్పవలెగద! అ॥

౧. బూచులయెకిమీనినిగొలిచితివిఁక-పుడమితేనిగానిలువగ దగుదువు
నీచెలికాండ్రనుచెంతనునిడుకొని-నీచందము మేల్మేలని మెచ్చఁగ
వేచని మానిసులకుఁగీడుసల్పు-పెను మెకముల నెల్లను నేలఁగూల్చి
రాచపనుల సాగించి నీ ప్రజలఁ-గాచుకొమ్ము కన్నబిడ్డలట్టుల॥ అ॥

క. నోచిన నోముల పంటగ
బూచుల యెకిమీ ప్రసాదమునఁ బుట్టిన నీ
వీ చెంచులెల్ల మేలని
నీ చందము మెచ్చునట్లు నెగడుము తండ్రీ! ౨౫

తే. పుడమిఱేనికిఁ గల దమ్మములను గొన్ని
నీకుఁ దెల్పెద డెందాన నిల్పుకొమ్ము
ఎఱుఁగువానికి సయితము నెఱుఁగఁ జెప్పు
టరయ పెద్దల దమ్మమ యగును కుఱ్ఱ! ౨౬

ఉ. వెన్నుని కల్మి లేక సరవిన్ మెయి తాలుపు రాచపుట్టువి
ల్లెన్నఁడు బొందలేదు సుమి, యింతటితో సుగమే మిదమ్మమున్
జెన్నుగ నిల్పమిన్ జనునిచేఁ బడి, తాలిమివీడి, పిమ్మటన్
పున్నెఁపు తావుదవ్వగుట పుట్టువు చీకటినూతిలోఁ బడున్. ౨౭

క. మిక్కిలి రొక్కముతోఁ దన
బొక్కసము న్నింపుకొనుటె పోకర్జముగా
దెక్కుడు సుగములఁ బజలకుఁ
దక్కకఁ దా సలుప ఱేండ్లదమ్మము పట్టీ! ౨౮

క. చెడు నలవాట్లకు లోనై
కడుబోగములందు బుద్ధి గడలుకొనెడు నా
యొడయుండు జనునిచే నలు
గుడువడు మఱి మంచి పుట్టుగును గాంచఁడొగిన్. ౨౯

తే. విద్దెలను బెంచి పెద్దల విత మెఱింగి
అన్నిరీతుల దమ్మము లరసి పజల
మెప్పుఁగొని మీద దబమును మేల్మి సల్పి
యీసరుని జేర వలయుఁజుమ్మది నిజమ్ము 30

క. నడతల యందున ప్రజలకు
నొడయుఁడె పో దారిఁ జూపుటొప్పు పుడమిలో
నొడు దొడుకు లెన్నిగల్గిన
మెడనైనను తాల్మిఁబూను చేలఁగ వలయున్. ౩౧

తే. ఎలమి మనచెంచు మరియాద నెడయకిపుడు
కాపు మెకముల వేటాడి గట్టిబిరుదు
మగఁ డితండను పేరు సొంపారఁ బొంద
పొమ్ము కానకు చెలులతో రమ్ము వేడ్క ౩౨

క. అనుటయు నన్నఁడు, కాముం
డను నెచ్చెలికాండ్రు విల్లు నమ్ములు వెంటన్
గొనిరాఁ దిన్నఁడు వేడ్కన్
దన తండ్రికి మ్రొక్కి సెలవు తాఁగొని పిదపన్. ౩౩

ఉ. బంగరుమోము టేటి దెస బారుచు, బాకును, విల్లు, నమ్ములన్
రంగుగఁబూని నెచ్చెలులురా నడవిన్ వెసఁజొచ్చి యుల్లము
ప్పొంగఁగ పూలజొంపములఁ బొల్పగు కోనల, తేనెకాల్వలన్
నింగికి నంటు మ్రాఁకులను నివ్వెఱఁగందుచు కాంచి సాగుచున్ ౩౪

వ. ఇటు సనిచని ముందట - నేను, నాదియుని - నాయంతటివాఁ డిం కెవ్వండని, మెప్పులం బొందఁగోరి, గొప్పలంబల్కుచు, తుదకు ముప్పుతిప్పలందు బేరజముపోల్కి - వెనుకముందు లరయుక, తప్పు దారులంబడి - ఎండి రాలిన ఆకలమ్ములం గప్పంబడి, చేఁజిక్క పఱకు మంచినగపఱచుచు నమ్మించి, గొంతుకలుగోయు వెంబర విత్తుమాడ్కి - మట్టపునేలవ లెఁదోఁచు చీఁకటిగోతులంబడిన యొం టరి పందులును; పందులంబట్టి వేటాడుటకై బండరాళ్లసందునఁ బొంచియుండి, - నెద్దియే నొక తెఱఁగున నెవ్వరిజోలింబోక బ్రతుకు

తెలివిఁ జూచుకొను యూరికాఁపుల నేకరణిం బీల్చి పిప్పిసేయుటని
పలుదెఱంగుల దలంచు కుచ్చితులగు పోలిరాయుల తెన్నున నలు
దెసలం బరికించు మువ్వన్నె మెకములును; మెకములం గాంచి,
వెన్వెంట నరుగుచు, సంగతి నెఱపుచు, పజ్జలందిరుగుచు, తినయి
చ్చలందీర్చుకొను నాటికి కుచ్చితమూని, మచ్చికతో వంచించి,
కంట దుమ్ముఁగొట్టు తుంటరి చెలికాని తెఱంగున - కడువడిగా తన
కుచ్చుతోఁకను తడియిసుకలో పొదిగి, కంటిపైఁగొట్టి తటాలున
పైబడి కఱచి తిననెంచు జేఁచులును; జేఁచుల నుసికొల్పుచుఁ
జెట్లకొమ్మల సందునఁ దోఁచియుం దోఁచక, రాచప్రాపున విఱ్ఱ
వీఁగు చదువరుల సొబగున - కిచకిచలాడుచు, వెక్కిరించుచుఁ
గొమ్మల నూఁగులాడు కోఁతుల గుంపులును; గుంపులుగుంపు
లుగాఁ గూడి యెటనుండి యెవ్వరరుదెంతురో యని, అటునిటు
బరికించుచు వలువలం దిగనాడి నీటం జరలాటమాడు రాచచేడి
యలవడువున- బెదరుచూపుల నలుదెసలు బరికించుచు, వినికిడియై
నచో వెఱఁగుపాటున వీనులు నిగిడించుచు, వంగి లేఁత పచ్చికఁ
గొఱుకుచుఁ దిరుగాడు లేళ్ళమందలును, మందలు మందలుగా
పొదరిండ్ల సందున పెండ్లిబాజాలవలె సందడిగా పలురకమ్ముల
పలుకులు వలుకుచు, వీనులకింపుగొల్పు పక్కిగములును; గము
లుఁగా గుమిఁగూడి దవుదవ్వుల నఱిగి విరులంగల తేనియలన్
బిరబిరఁగొని, యొరుల కంటఁబడకుండ, కొమ్మల మరువునఁ
బెరలఁగాఁబెట్టు జుంటీఁగల నదలించి, తేనియలం బీల్చుటకయి -
తాఁ దిన కొడుకుల కిడక యొడలి సుగములనైనను సరకుఁగొనక,
కడుపుఁ గట్టుకొని, మిక్కుటముగా సేకరించు పిసినిగొట్టుబొక్క
సములం దోఁచుకొను కన్నగాండ్రచాడ్పున చెట్లకెగఁబ్రాకు
నెలుఁగుబంట్లును; ఎలుఁగుబంట్లకు కొఱవిదయ్యములట్లు వెఱపుఁ

దనముఁ గల్గించు తెఱంగున - చీఁకటి మ్రాఁకుల సందున మిఱు
మిట్లుఁ గొల్పు మిణుగురులును; మిణుగురుల నిప్పుకణమ్ములుఁగా
బ్రమించి పోఁవానక్కి, చలిఁ దీర్చుకొనుట కొఁడళ్ళఁ గాచుకొన
నెంచి, చుట్టు గుమిఁగూడిన నడవి మానిసులును; గల్గు కారడవిం
జొచ్చి, వేట తమకంబున - నలుదెసలం దిరిగితిరిగి, యెట్టి జెట్టి
కైన ననువుపడక, బలిసి, మిన్ను, మన్నుఁ గానక, గరువమ్మున
మేను మఱచి, నడయాడు పలుగొమ్మ మెకమ్మ వెంటనంటి
అలసి, సొలసి, యరుగుచుండ, నెట్టకేలకా పంది యడవి నంతటం
దిరిమ్మరించి, బంగరు మొగవు టేటి సరస, పలురంగు లీను చరి
యలన్, బండ్ల మ్రాఁకులన్, మంచి తావు లీను పూవుటీరమ్ము
లన్ వెలసి, కన్నులకు పండువుసేయు మెట్టనేలఁ గల గట్టునకు
కొంత దవ్వున నెట్టనం దోఁడ్కొనివచ్చి, చట్టున మాయమై
నంతఁ దిన్నఁడు నివ్వెఱగంది, ౩౫

ఉ. ఏమిది మాయమయ్యె నరరే! కడుసోద్యము, పంది యిద్ది కా
దేమిరొ వచ్చునింక మన కేర్పడ దీనినిఁబట్టి చూడఁగా
నా మినువాక తాలుపిలు లక్కట! మోసము సేయనెంచెనా
కాముఁడ! అల్లదే తెలుపుగాఁ గనఁదో చెడు కొండ నేదియో ౩౬

క. అని యుత్తెఱఁగునఁ దిన్నఁడు
మనమునఁ దడబాటుఁ జెంది, మఱిమఱి వలుకన్
తన చెలికాఁడగు నన్నఁడు
వినిపించెం దనకు దాని వింత మిప్పోల్కిన్. ౩౭

చ.5 అదిరొక మంచిగట్టు తనరారెడు నందొక దేవళంబు, పెం
పొదవెడు నందు నుల్లమున కొప్పగు లింగము, తొల్లి వేల్పు ల
య్యది నెలకొల్పిరంచు తెలియంబడు, నా గుడి నొక్క బాపఁడో
ప్పిదముగఁ గొల్చు నీసరుని పెన్నిమకుల్ వెసలార వేడుకన్. ౩౮

తే. సాజమగు సిరుల్ వెలసి బల్ తేజమీఱు
మానికపు టాలవాలులతో నెగడుచు
మేను గగురించు పూదేనె సోనలొలయ
కానలుంగల్గు నక్కొండ కోనలందు. ౩౯

క. అనవిని తిన్నఁడు గొబ్బున
తన చెఱలంజూచి యటకు దారేది? యని, కా
ముని దనవెంటను రమ్మని
మునుముందుగ సాగె వేలుపుంజూడ వెసఁ. ౪౦

ఉ. పుట్టలు, గుట్టలివ్వియని ముండ్లివి ఱాళ్ళివి అప్పలివ్వియఘుం
చట్టిటుఁ బోక ముక్కునకు నానెడు నూటిగఁ బారి కోవెలన్
చట్టునఁ జేరి లింగనికి సాగిలి మ్రొక్కినయంత, బోయరా
పట్టికి నెన్నఁడుం గనని బల్మియు తేజొనఁగూడె వేల్మిడిన్. ౪౧

తే. ఇటుల మిక్కుటమగు బత్తి నెనసి తిన్నఁ
డొడలు దెలియక కొంతసేపుండి లేచి
యెడఁద నడఁగిన తెల్వియొక్కింత నెలయ
వడిగ లింగనిఁ గౌఁగిట నొడిసిపట్టి. ౪౨

ఉ. పూవిలుకాని బట్టిదపు పూన్కి నడంచిన సామి! వేలుపుల్
మేలన సాము మేన బలిమిన్ గవరమ్మను నిల్పి, నెత్తిపై
తాలిమి మిన్నువాకను సతమ్మును దాల్చి యెల్లబత్తులన్
మేలిమి సాకునట్టి నిను నేస్తనె కీరితిసేయ? నీసరా! ౪౩

---

## 5. మంజరి — ధన్యాసి

౧. మునుపు జేజేలు నెలకొల్పినట్టి - వినుతాల్పు దేవళంబు
కనులపండువై యలరారెడు నిక్కముగ నందు లింగంబు
౨. తపసిరాయఁ డొకఁడాగు డియుండు సతంబు వెలుగొందుచుండున్
ఎపుడొక తెఱఁగున సిరుల వెలసి పు - న్నెపుతావై మనుచుండున్

తే. ఎల్లమెయి తాలుపుల లోని కీడ్చి మరల
వెలికిఁ బెట్టుచు నదియొక వేడ్క గాగ
నాటలాడించి యెద్దాని నంటకుండ
వరలుచుండెదు నిన్నెన్న తరమె నాకు. ౪౪

తే. పేరు, చేతయు, రూపు నేతీరు లేక
నన్నిటికి లోన వెలుపల చెన్నుమీఱి
అన్నిరూపుల నీవయ్యె యున్నవాఁడ
వనుచు పెద్దలు పల్కెదు రన్న! నిన్ను. ౪౫

తే.6 లింగరూపాన నీవిట్లు దొంగవోలె
ఒంటిగా కొండ దాఁగిలి యుండనేల?
నిండుబుద్దిని నినుఁగొల్చు దండిబత్తు
లరయ నరుదని వచ్చితే యడవికిట్లు? ౪౬

తే. అలిగి మాయమ్మ గవరమ్మ నట్లు విడచి
ఒంటిగా వచ్చినావె ముక్కంటి యిట్లు?
ఇచట నీ కూడిగము సేయ నెవ్వరుందు?
రాకటికి నోగిరముఁ దెచ్చు అవ్వగలదె? ౪౭

క. లెమ్మా, నాతోడను, వే
రమ్మా మావీటికిపుడు — రాకున్నను నే

---

6. కన్నడ — ఆదితాళము

ప. అయ్యయ్యో! మాయయ్యా! యొంటిగ
నడవి నుండ నీ కేమయ్యెనురా॥ ॥అ॥

అ. అయ్యారే! నినుఁగొలిచెడి బత్తులు అరుదైరని నీ వలిగి వచ్చితివ
నెయ్యమెఱిఁగినీయాకలిఁదీర్పఁగ—నెవరోగిరమున్ బెట్టఁగ దెత్తురు॥అ

మి. ఇయ్యడవిని నీకూడిగములు గావించు వారలెటునుండిరాగలరు—
వెయ్యేటికిమనవీటికేఁగుదము—లే లెమ్మురమ్ము—విడువనిఁక సుమ్ము॥అ

నెమ్మెయిఁ బోఁజాలను సుమి
నమ్మ్రము నా కన్నతండ్రి! నా ముక్కంటీ! ౪౮

సీ. బిడ్డలులేనట్టి గొడ్డువాఁడవ? పజ
లందఱు నీవార లగుచు నుండ
దిక్కుమాలినవాని తెన్నున నీకొండ
నుందువే? వేల్పురాయుండ వయ్యు
అక్కటా! మాటాడ వాకలిచే సొమ్మ
సిల్లితి కాబోలు చెనటి నైతి
నుండు మిప్పుడ పోయి తిండిఁ దెచ్చెద
నబ్బ యెంతటి దోస మబ్బె నీకు

గీ. ననుచుఁ దిన్నఁడు పరువున నరిగి, మంచి
నంజుడును, పండ్లు, తేనెయు, ననలుఁ బట్టి
పుక్కటను నీరుఁగొని, కొండ నెక్కివచ్చి
చెప్పుకాలను గుడిలోని చెత్త నూడ్చి. ౪౯

తే. బోయలెల్లరు నబ్రము నొందుచుండ
నీరు లింగనిపైఁ జిమ్మి నెత్తిమీఁద
పూలనిడి, విందు నారగింపుమ యటంచు
కేలు గవమోడ్చి యిప్పోల్కి కీరితించె. ౫౦

ఆ. ఈజగములకెల్ల నీవు పబుండవు
పసయొకింత లేని నిసువు నేను,
ఈసర! యిటనీకు నిచ్చవచ్చిన మంచి
తిండిబెట్టు టెట్లు? తెలియుమయ్య! ౫౧

తే. అక్కఱకు వేగ సమకూరినట్టి బోన
మిపుడు దెచ్చితిఁ దీని నీవింపుగఁ దిని

నాడు కోరిక మన్నించి నన్ను నేలు
మన్న! వేలుపులకు మిన్న! కన్నతండ్రి! ౫౨

క. అని తాఁ దెచ్చిన నంజుడు
లను లింగని ముందుఁ బెట్టి లాలించుచు, బ
త్తిని వేడెడు తిన్ననిఁ గని
తనచెలు లిప్పోల్కి ననిరి తద్దయు వేడ్కన్. ౫౩

మ.7 ఎచటన్ జూడని వెఱ్ఱిబత్తి యిటు నీ కెట్లబ్బెనో తేఁడ! నీ
విచటన్ బూన్కినిఁ బ్రాలు మాలునదియా నీరాతినింగొల్వ, నే
రుచు నే మాటలనద్ది యెన్నఁడును నే రూపొంది యింతేని నీ!
ఇచటన్ జాగిఁక నేల లెమ్ము తడవాయెన్ వీటి కేఁగన్ వలెన్. ౫౪

క. నిక్కముగ తాతిబొమ్మలు
మెక్కునె యోగిరము లెపుడు మెయికొనఁ దగునే
అక్కట మానిన పతిమల
చక్కటి దయ్యంబులంచుఁ జనునే తలఁపన్. ౫౫

సీ. ముసలితేఁడేమైతిమో యని బొక్కును
తం దెమ్మ నినుఁజూడ తొందఱపడు

---

7. బిళ్హారి — ఆదితాళము (54, 55 పద్యములకు బదులుగా)

ప. ఎక్కడఁ జూఁడని యీ వెఱ్ఱి బత్తి -
యెటులబ్బెను నీకిపుడో తేఁడా ! ॥ఎ॥

అ. అక్కట మాలిన తాతి పతిమకిటు -
మ్రొక్కుచు నెన్నాళ్ళట కూర్చుందువు ॥ఎ॥

చ. నిక్కముగా మానిసు లిడు విందుల - మెక్కునటుల తాతి
బొమ్మ లెందును - ఇక్కరణిని నీ వెన్నాళ్లుండిన -
నెట్లు మాటాడు ముక్కంటి వచ్చి ॥ఎ॥

రమ్మపోదము జాతిబొమ్మ నీ వెంటను
వచ్చుటెట్లది వట్టి పిచ్చిగాక
ఇట్టి వెఱ్ఱిగలాఁడ వీవయ్యెదని కల
నైనఁ దలంప మక్కటా! యిదేర?
మంచి యేలికను గ్గించె వేల్పని యెల్ల
చెంచువారము సంతసించినాము
గీ. లెమ్మనుచు సందిటంబట్టి లేవఁదీసి
తమ్ములం బాసి సనలేని తుమ్మెదలటు
తోట్రుపడుచున్న చెలికాండ్రతోడ తిన్నఁ
డొడలిపైఁ దెల్విఁబొంది తా నుడివె నిట్లు ౫౬
సీ. అన్నలారా! బేసికన్నుల వేలుపు
గొలుచు బాగెముకన్నఁ గలదె మిన్న?
ఎన్నఁగా జగమున నున్న భోగములెల్ల
సున్నయే తుదకు గాకున్న తిర మె?

---

8. అఠాణా — ఖండగతి (57, 58 పద్దెములకు బదులుగా)

ప. అన్నలారా! మనకు - విన్నుకొమ్మడి వేల్పు
కన్నులారఁగఁ జూచు-కన్న బాగెము గలదె॥ అ॥
అ. ఎన్నఁగా జగములో - నెన్ని భోగములైన
సున్నయే తుదకు గా - కున్న తిర మెటులగును॥ అ॥
మి. పన్నుగ మీకును నా - పై నెనరుండినయెడ
నన్నుఁగలసి లింగని - నెన్నికతోఁ గొల్వుఁడు॥ అ॥
౧. ఈరేడు జగములను - నేలు పబు వీతండు
కారడవిలో నొంటగా నుండఁగాఁ జూచి
ఔరా! యెటువీడుదు - నరమ గేల మన యుడు
మూరికి రాకున్నెడ - నూరకెటుల వత్తును॥ అ॥

ఏనాటికైనను నీసరు నడుఁగు ద
మ్మలె దిక్కు సూ మానినులకు నెల్ల
అట్టిదయ్యము నెట్టు లడవిలో నొంటిగా
వీడి రాదగు మన వీటికిపుడు

గీ. పన్నుగా మీకు నెనరు నాపయినిఁ గల్గి
యున్న ననుఁగూడి లింగని నేపు మీఱఁ
గొలువ పున్నెంపు బ్రతుకున వెలయఁగలరు
సనుఁడు లేదేని వీటికి తనివిఁజెంది. ౫౭

క. వేయేలను నుడుమూరికి
హాయిగ నాతోడ లింగఁ డరుదెంచనిచో
నీయెడ నిల్చెదఁ గొల్చెదఁ
బాయుట యిఁక కల్ల యొట్టి పాటున నైనన్. ౫౮

సీ. నాపాలి దయ్యము, నాకన్నవారలు,
చుట్టముల్ చెలులు తోఁబుట్టువులును,
నెల్ల సిరుల్ వేయునేలను బ్రతుకెల్ల
గట్టువిల్తుండె నిక్కముగ నాకు
గాన నాకేల నక్కఱలేని గొడవలు
కడువడిఁ బ్రోలికి వెడలిపోవుఁ
డడకువతోడ మాయమ్మ కయ్యకు చాల
మ్రొక్కితి ననుఁడు, నా చక్కటి కెద

గీ. వంతనొందకుఁ డనుఁడు రవ్వంతయైన
విసపుమేతరి బత్తులవెల్లమ్రాను
వేడి, యాతనితోడ నేఁగూడి, వీడు
సేరఁగలనని పజకెల్లవారి కనుఁడి. ౫౯

క. అనవిని తిన్నని వితముకు
పెను వెఱపుం జెంది చెలులు వెనువెంటన్ దాఁ
బనివిని తేనిం గని, మో
మున విన్నదనమ్ముఁదోఁప మ్రొక్కుచు తుదకున్. ౬౦

తే. చెప్పఁజాలక తడబాటుఁ జెంది, తుదకు
కన్నుఁగవలను వెస నీరు గ్రమ్ముచుండ
చెంచు లెంకలు నాగన్న చెంత నిలచి
తెలిపి రిప్పోల్కి తిన్నని తెఱఁగువారు. ౬౧

ఉ. ఏమును పిన్న యేలికయు నేలినవారిఁడు యానతిన్ వడిన్
సేమముతోడ కారడవిఁ జేరి మెకమ్ముల వేటసల్పు చా
పైమది సబ్బమున్ గొలుపు పంది నొకండటఁ గాంచి, వెంబడిన్
మేము హుటాహుటిన్ పఱువ మీఁదట నయ్యది మాయమై
సనెన్ ౬౨

చ. అటనొక కొండచేరువను - హాయిగఁ గొల్పెడు కోనలోన, సం
కటములఁ బాపు నీసరుని చక్కని కోవెలఁ గాంచి, అందులో
9

---

9. చక్రివాకము — చతురశ్రగతి

ప. ఏమని విన్నవింతుమో - నాగన్న దొరమిన్న ॥ఏ॥

అ. సామీ! నీకొమరుని చేఁతల కిపు ॥డే॥

౧. ఏ మడవిని వేటాడెడు తఱిని మా-కించుక దవ్వుల నొక దేవళంబు
కాముఁడు గని వివరింపఁగ బిరబిర - గట్టుపుట్టనక నీ ముద్దుపట్టి
మి. ఆమూడ్కి-నరిగి అచ్చోలింగని-నబ్బురమగుబత్తి నొడలుఁ దెలియక
వేమరు వేఁడిన మాగోడు వినక - వెడలిపొండనుచు
మా కాన నెట్టె ॥ఏ॥

తటుకునఁ జేరి తిన్నదొర దబ్బున లింగనిఁ గౌఁగలించి, యెం
తటికిని రాడు వేడినను దబ్బరగాదిది యబ్రిమో ప్రభూ! ౬౩

క. ఎన్నోరకముల పంజూడు
లన్నియు లింగనికిఁ బెట్టి అపి "దినకున్నన్
నిన్ను విడనాఁడ" ననుచును
పన్నుగ దా కారుపట్టు పట్టిందొడఁగెన్. ౬౪

క. ఓ తేఁడ! అతఁడు మన ఉడు
మూఁరికి నొంటరిగఁ జేరనొల్లండట, యీ
గోర మెంచటఁ గలదే తన
తో రావలె లింగఁడంట - తుదకెపుడైనన్. ౬౫

తే. విసివి వేసారితిమి వేడి వేడి మేము
కొనకు నతఁడు 'ససేమిరా' యనుచు మమ్ము
కసరి పొమ్మనె లేదేని కలసి యతని
తోడ లింగనిఁగొల్వ సంతోసమంట. ౬౬

సీ. మమ్ము దమ్ముఁదప్ప కెమ్మెయి నేలెడు
తేనిఁ బొందితి మెన్నరాని సుగము
లందెదమని యాసనందితి మక్కటా!
కాఅడవిని ఆయిఁ గాంచి, మనసు
వెట్టి, మమ్ము న్నిమ్ము వీటిని, ప్రజలను
గడ్డిపోచవితమ్ముగా దలంచి
జడదాంియయ్యో నీకొడు కెప్పుడో వచ్చు
పున్నెపుందాపులఁ బొందఁగోరి

గీ. ఇంత బేలతనమ్ము తా నెన్నఁడైనఁ
గాంచువాఁడని యే మెడ్డ కలనునైనఁ

దలఁపమైతిమి వేలుపుం దాట నగునె?
పబువ! మాదారి యింకెదో పల్కుమయ్య! ౧౭

ఉ.10 అంతట తండెయున్ దొరయు నప్పలుకుల్విని నబ్బురంబుఁ దా
మెంతయుఁబొంది, తిన్నని బలే! యని మెచ్చుచు, నిట్టిబాగెమున్
గాంతుమె? తొల్లిపుట్టువునఁ గల్గెడు బాగెములున్నఁగాని, యం
చెంతయు సంతసించి రిటు లేమని చెప్పఁగవచ్చు వారలన్. ౧౮

శా. ఏమేపున్నెము లెట్టినోములను మే మెమ్మాడ్కిఁగావించి నా
మో యింపారఁగ తొల్లిపుట్టువున కాముండా! బలే! కానిచో
మా యీతిన్నఁడు నింత బత్తుఁడగునా, మా బాగెమేమందు మా
రా! యా లింగఁడు కోరి వానికెదురై రా సోదెమయ్యెన్ గదా! ౧౯

తే. చేతులారంగ నీసరుఁ జేసి గొల్చి
నోరునొవ్వంగ ముక్కంటిఁ గోరి వేడి
దమ్మ మిసుమంత యైననుఁ దప్పకుండ
కొడుకుఁగను కడ్పు బంగారుకడుపుగాదె. ౨౦

క. మానిసి యైనందుకుఁ దా
నేనాటికి నైన వేల్పు నెఱుఁగకయున్నన్

---

10. పూర్వకల్యాణి — త్రిశ్రగతి.

ప. ఏమిపున్నె మేమిపున్నె-మెంతయయ్యొ మాతిన్నఁడి॥ దేమి॥
అ. కాముఁడ! తొలిపుట్టువునం - దేమినోము నోచినామొ ॥ఏ॥
౧. చేతులార మిత్తిగొంగఁ జేరిగొల్చు ముద్దుపట్టి
మా తిన్నం డయ్యెననఁగ - మాకు వేరె బాగెమేల॥
౨. ఏతొలిపుట్టువునందున - నెట్టి దబము సల్పినాఁడొ
యాతీరున కాఁడడవిని - నెదుటఁదోచె నెలతాలుపు ॥ఏ॥

వానిదొక పుట్టువే, చెద
లీనేలను పుట్టిచచ్చు టెఱుఁగమె యెపుడున్. ౨౧

తే. కొడుకు బత్తికి నలరుచు నుడుపు జేనిఁ
గాంచి, వ్రేలిని ముక్కుపైనుంచి, వార
లేమి యనుటకు నోరాడ కేఁగి, రచట
నడవిఁ దిన్నఁడు ముక్కంటి కడను నిలచి. ౨౨

క. పెను సంతసమునఁ దెచ్చిన
పెను మెకముల నంజుడులను - పెనఁగొను బత్తిన్
దినుమని యందిచ్చిన న
వ్వినుసిగదయ్యంబు వినమి విడువక నతఁడున్. ౨౩

శా. ఏమీ కన్నులనెత్తిచూడవిటు లీవేమాటయున్ బల్కవో
సామీ! ఆఁకటి సొమ్మసిల్లితివె? యీచందంబునన్ తోచద
య్యో! మా తోడవు; తప్పసల్పితినె? నీయుల్లంబు రంజిల్లఁగా
నేమాడ్కిన్ సవరించువాఁడఁ గొనుమా యీయోగిరం
బంతయున్. ౨౪

మ. ఇవిగో కొవ్విన మంచిజింకలను నే నిక్కోలతోఁ గూల్చి, చి
న్నవిగా ముక్కలుగోసి కాల్చితిని, అన్నా! వీనినిన్ మెక్కుచోఁ
దవులున్ మేనికి బల్మి, తాల్మియును డెందంబం దిఁకే సందియం
బవుచో వేగమ దెల్పు మాపగిది నేర్పారంగఁ గావించెదన్. ౨౫

ఉ.11 ఈక అకుట్లకమ్మదన మించుకలోపము? కాల్చుచాలదా?
లేకివి మాడెనా? నమలలేనటులున్నవ? చిన్ననైనవా?
నీకివి నచ్చలేద? మఱి నేనిడఁ జాలినవాఁడఁ గాన? నీ
యాఁకటిప్రొద్దు మీఱెనద? అప్ప! కడుంగడు వేగఁ దెల్పవే. ౨౬

తే. పలుక, పులుకవు, తలయూఁచ వలుక వేమొ
కోలము, బెలమును నెచ్చు తక్కువలు నీకుఁ
గలవె? నినుఁగొల్చు వారిలోపలను తండ్రి!
నిన్ను విడనాడి కుడువ నే నెన్నఁడైన. ౨౭

ఉ. ఈవిటు లీసడించి యిటు లేనిడు తిండిని మానెదేని, యో
దేవర! నీదు చెంగటను తెంపున నా నిసువుల్ దొఱంగుటల్
నీ వరయంగలాఁడ విది నిక్కమటంచును నెత్తి, నోరుఁ దా
వావిరి మొత్తుకొంచుఁ దనపైఁబడి బావురుమంచు నేడ్చెనన్. ౨౮

క. తిన్నని తెంపరి తనమును
వెన్నుని చెలికాఁడు గాంచి వెఱఁగందుచుఁ దాఁ
గన్నుల కగపడి ప్రేముడి
మన్నించుచుఁ బల్కె నిట్లు మాలిమి వెలయన్. ౨౯

## 11. కన్నడ — ఆదితాళము

ప. అయ్యో! తినవేమయ్యా! వీనిని-ఆఁకలితో నెన్నాళ్ళిటులుందువు॥అ

అ. ఇయ్యెడ నాఁకటి నెంతయు బడలితి - వీవని యీ క్రొవ్విన
మేకపుపోలను

మి. నెయ్యమెలఁగి నేఁగొనివచ్చి కాల్చి- తియ్యవిదినుచో నెంతయు
నొడలికి। చయ్యనఁ దాల్మియు, బలిమియుఁ జేకురునయ్యా
సందియ మొందనేటికిఁక॥ అ॥

౧. కమ్మదనమ్మును గల్గినవి కావ?-కాల్పుచాలదా? క్రొవ్వినవి కావ?
ఇమ్ముగనోటం బెట్టగ నిమడవ?- యాక అకుల్లలను మాడినవా?
నెమ్మదినొక దోసం బెంచితివా?- నిన్ను వీడి కుడిచెదననితలఁతువ?
ఎమ్మెయి నినుఁ గొల్వఁగ తగనందువ?- ఇచ్చకువచ్చిన
వియ్యవి కావ? ॥అయ్యో॥

తే.12 వెఱ్ఱిబాగులవాఁడవో కుఱ్ఱ! దీని
కింత తెంపరితనము నీకేల వినుము
సంతసించితి నీబత్తి కెంతపనికి
నైనఁ జాలుదు వీగోడు మానుమింక. ౨౦

శా. నిన్నుంబోలిన బత్తు లీపుడమిలో నేఁ గాంచలే దెన్నఁడో
తిన్నా! మెచ్చితి నిచ్చవచ్చె విను, బత్తిన్ బల్మి నీకెంతయై
యున్నన్ సూడఁగఁ గోరి పల్కనయితి ట్లొండెద్దియున్ గాదురా
అన్నా! నిక్కపుబత్తి మున్ను నెవఁడో యాతండు నావాఁడగున్ ౨౧

మ. కొలమున్, కొద్దియు, గొప్ప నాకుఁగలదే కుఱ్ఱా! కసింతేని లో
పల కొండెద్దియులేక మంచినడతన్ బత్తిన్ ననుంగొల్చు వా
రలు నాకిచ్చెడు దెద్దియైన మదిలో రవ్వంతయున్ సందియం
బెలమిన్ బొందక యే ప్రసాదమును చే నెప్డారగింతున్ సుమీ. ౨౨

తే. అనుచు నోదార్చి తిన్నని నట్టె తట్టి
తానొసంగిన కఱకుట్లు నానె, సుంత
యేని నెబ్బరికములేక నిట్టి దరయ
కొల మడుఁగ నేల వేల్పులఁ గొల్పునెడల. ౨౩

---

12. కల్యాణి — రూపకము

ప. ఇంత వెఱ్ఱిబాగులాడ - వీవైతివయో తిన్నఁడ॥ ఇంత॥
అ. సంతసించితిని బత్తికి - చాలును నీగోడుమాను॥ మింత॥
చ. ఎంతటిపనికైన నను నీ- విసుమంతయు నెనుదీయవు
ఇంతింతనరాని బత్తి - నెపుడు వెలసి యలరారెద॥ వింత॥
౧. నీ నిక్కపుబత్తి నరయ - నే నిట్టులఁ బల్కకుంటి
గాని కొద్దిగొప్పలున్న-వే నన్నెడయకఁ గొల్చిన
మానిసు లిడు విందుల నే- దేని ప్రసాదంబని మెపు
డేను వేడ్క నారగింతు - నిది నిక్కంబని తెలియుము॥ ఇంత॥

తే. ఇప్పుగిదిఁ దిన్నఁడిచ్చినవెల్ల మెక్కి
గట్లరాపట్టిమగఁడు నాగన్నపట్టి
నట్టె మదిమెచ్చుకొనుచు నేమనక యూర
కున్న యెడఁ దల్లడిల్లి యా తిన్నఁడంత. ౮౪

ఉ.13 ఈ విటు మాటలాడకయె యిట్టుల మూఁగదనంబు నూనఁగా
నావిత మేమొ యెవ్వరికినై యిటు లొంటిగ వేచియుందువో
దేవర! తెన్నుఁదోఁపక మదిన్ వెఱపించు మెకాల కున్కి యా
తీవలనీఁడ నీయడవి దేనికినై వసియింతువో ప్రభూ! ౮౫

క. రమ్మా, మా యుకుమారికి
నెమ్మనముం దనియఁ జేయు నేరెడు, పనసల్,
తుమ్మిక, యనంటి, మావుల
కమ్మని పండ్లెన్నొ నీకుఁ గలవచ్చోటన్. ౮౬

సీ. వెలలేని నివ్వరి వెదురుఁబ్రాలి ల్గునుఁగుఁబ్రాలి
ల్మేలైన నవరపు మెకపుపాలు,

---

13. నాథనామక్రియ — త్రిపుట
( 85, 8౬, 87 పద్దెములకు బదులుగా )

ప. ఏలరా! యీ మూఁగదబము నీ॥ కేల॥
అ. చాలనో నిన్గొల్వ నింక - కూళనో నీవాఁడఁగానో
చ. మేలుమేలు బత్తులపాలిట - వేలుపుమ్రాఁకీవని పెద్దలు
చాలబల్కుచుందురు నీమది-జాలినొంద వేమి సేతునయయో॥ ఏ॥
౧. గండుమెకముల తోడఁగూడి - ఎండవానల కోర్చి యిట్టుల
కొండపై యీ కాన నొంటిగా - నుండగా నీకేమిమేలౌరా
మెండుగ కునుగుఁబ్రాలు నవరపు-మెకపుఁబాలు నివ్వరిఁబ్రాలును
దండిగ పుట్టతేనెలఁ దప్పక నీకారగింపు సేతుర॥ ఏలరా॥

పుట్టతేనియు, జున్ను, పట్టుతేనెయు, పెర
తేనెయు, ఎడనీరు, తీపికల్లు
ఇప్పసారాయియు, ఇంజేంట్లు, నాడిపిళ్ళు
కమ్మగా కాల్చిన కజ్జికట్లు,
రకరకాలుగ వండు మేకముల నంజుడుల్,
పిట్టపాళము వండిపెట్టు దిండ్లఁ
గీ. గలవు నీయిచ్చవచ్చిన కైవడిఁ దిని
హాయిగా పాలజామేడలందుఁ బండి
యుండుమీ యేటిగడ్డ నీ వొండుదిక్కు
లేక నీపాడుగుడి నుండ నీ కిదేల. ౮౭

సీ. ఎవ్వరేనియు బత్తులేమైనఁగోరుదు
రని యొంటి నీగుడి నడఁగినావొ?
కొడుకుల యిల్లాండ్రనెడబాసి యీ దబు
సెవ్వరి కొఱకు గావింతు విచట?
ఒకదానికింబల్క వూచవుతలనైన
బత్తులపాలిట పంతమేమొ
ఊరకుండినవారి కూ రేమిసేయునం
చని యెంచితే విను మంతలోనఁ
గీ. దిన్నఁ డరుగునటంచు నీవెన్నఁడైన
బ్రిమయకుము వీడు పట్టినపట్టు విడువఁ
డంచు నెంచుమ యేనాటికైనఁగాని
రమ్మ నీవింక మది సందియమ్ము వీడి. ౮౮
క. మేలుగ బత్తుల పాలిట
వేలుపు మాఱఁకీవయనుచు – పెద్దలు పలుకన్

జాలిం బొందవు గద జా
గేలను? నాకోర్కెఁ దీర్ప నెంచవు సామీ! ౮౯

తే. విసము మెసవిన గొనమింక విడువలేద?
బొసగు నెంచక నీవు నాతోడ రమ్ము
కసి యిదేలను నాపైని కన్నతండ్రి!
అసలు నిన్వీడనని బుద్ధి నరయుమయ్య! ౯౦

ఉ. దోసములెంచఁబోకు కడు దొడ్డగొనమ్ముల కున్కి నీవు నన్
గాసిలఁ జేయకయ్య! నినుఁగా కొరులెవ్వరి నమ్మనయ్య! నీ
తో సరివేల్పు లిప్పుడమిఁ దోఁచుట నాకెటులయ్య! కావుమో
యీసర! దోసిలొగ్గితిని. యే నెటువాయుదు నీయడుంగులన్. ౯౧

తే. నిక్కముగ నీవు రాకున్న నే సనెద నె?
నీదు చెంగటఁ బడియుందు, నిన్ను వీడి
యొక్కనిముసము నేఉండ నొల్లనయ్య!
ఈవు లేకున్న నా బ్రతు కేటికయ్య! ౯౨

తే. ఎల్లప్రాణిమిన్కలే నిన్ను నెఱుఁగలేక
తుదకు నోరుమూసికొన్నవి పదిలముగను
నిన్ను నే గీరితింపఁగ నేర్వఁగలనె?
చెంచువాఁడను, చెనటిని, చిన్నవాఁడ. ౯౩

తే. అనుచు లింగనిపై తిన్నఁ డల్లె వ్రాలి
సందిటం బట్టుకొని మేనునందు నెఱుక
వీడి తలఁపులఁ బోనాడి వెఱ్ఱిభక్తి
నున్న తిన్ననిఁ గని ప్రొద్దు కన్నుమూసె. ౯౪

సీ. పగఁబూని నీకు దిక్కగు నెవ్వఁ డిఁక నను
పోలిక చీఁకటుల్ పుడమిఁ బర్వె,

మేనెల్ల కనులుఁగా మిన్ను తిన్ననిబత్తిఁ
జూచునో యనునటు చుక్కలొప్పె;
ఒరుల యిక్కట్టుల కోగి సంతసిల్లెడు
కుచ్చితులటు గుడ్లగూబ లలరె;
ఇంతలో పగడీకు పెటు లేఁగుమని, చీఁక
టిం దరుమఁగవచ్చె చందమామ;

గీ. వెన్నెలపులుంగుపిండులు వేడ్కనొందె
ముద్దుగా నవ్వె కలువలు, మోముమాంచె
తమ్ములు, జగానఁగల మెయితాలుపులను
కౌఁగిటంబెట్టె కూరుకుఁకలికిమిన్న. ౧౩

సీ.14 ఒడలెఱుంగక కూర్కనొందక నారేయి
బుడుతచందురు తాల్పుకడను వ్రాలి
కలకల పిట్టలు వలుక నా తిన్నఁడు
తెలవారెనని కనుల్ నులుముకొనుచు

---

## 14. మంజరి — చతురశ్రగతి

౧. ఒడలి నెఱుంగక కూర్కంబొందక- బుడుత నెల తాల్పు నెంచి
గడపె నా రేయి నొకనిముసమ్మనఁగా తెలవారుటఁగాంచి
౨. కడువడి వలసిన బండముఁగొని రా - కదలి కారడవిఁ జొచ్చి
ఎడనెడ కంటంబడిన మెకమ్ముల - నేసి నంజుడుం దెచ్చి
3. కట్టెయలన్ రాపిడిసేసి నిప్పగావించి కాలనిచ్చి
నెట్టనఁ బండ్లను, బూలఁ గోసి తా - నీరము పుక్కిటఁబుచ్చి
౪. ఎచ్చినసందడిఁ దిన్నఁడు మరలిన - నీలో దేవళమునకు
వచ్చెను 'శివకేసరి'యను నొక బాపఁడు లింగనిఁ గొల్చుటకు॥

వంగి సామికిమ్రొక్కి వలసినబండముల్
గొని తేర నడవికి జని యతండు
ఎడనెడఁ దాఁ గంటఁబడిన మెకమ్ములఁ
దునుమాడి సంజుడు ల్గొనుచువచ్చి

గీ. కట్టెయల రాపిడింజేయఁ బుట్టినట్టి
అగ్గి రగులించి యవ్వాని నందుఁ గాల్చి
కమ్మఁదనముగ కళుకుట్లు కడఁగిసేసి
పూలఁ బత్తిరిఁ, బండ్లను జాలగూర్చి.

క. పుక్కిట నీరముఁగొని, పెం
పెక్కిన సందడిని నాతఁ డీసరుఁ గొలువన్
చక్కగ మరలఁగ నీలో
నక్కడ దేవళములోని కత్తరి వేస్కన్.

సీ. నొసట బూదియుపైని మిసమిసలాడుచు
చెందిరపుంబొట్టు చెలఁగుచుండ
రుదురక్కపేరులు ఱొమ్ముపై నడయాడ
బంగరుబొందియు చెంగలింప
దెసలను జిగిఁదేర్చు మొసలిపోఁగు లెసంగ
పులితోలు చంక నింపొందుచుండ
కావిదోవతిని సింగారించి, జారీయు,
పూలసెజ్జయు నిరుకేల నమర

గీ. బమ్మదేవర పోలిక బత్తిమీఱి
బుడుత నెలతాల్పు చెరువారు గుడికి నంత
వడిగ శివకేసరి యనెడు పుడమివేల్పు
మొదటిచదువులు నుడువుచు కదలివచ్చి

తే. కాలియుం గాలకున్నట్టి కంపుపొలసు
వాడిన విరులు, కొఱికినపండ్లు, యెంగి
లాకులుంగల్గి వెగటుగా నగపడియెడు
గుడినిఁగని బాపఁడెంతయు చిడుముడిపడి. ౯౯

మ.15 పులిమీాసమ్ములఁబట్టి యూఁగునటు లిప్పోల్కిన్‌బలే! యెవ్వరో
తులువల్‌సల్పిన యిట్టిచేఁతలకు నెంతో సంతసం బందితే?
తెలివింబాసితె మేనిపైని? పెఱపేడీ వేల్పునన్, దుండగుల్
చెలఁగాటింపరె ఇచ్చవచ్చినటు లిస్సీ! ఇంకనో యీసరా! ౧౦౦

మ. ఎవడాతుంటరి యెందు దాఁగెనో కదే! ఇప్పట్టునన్ వాడు, నా
కవురా! తోఁచిన నీఱుసేయనె యెవండడ్డైన నాయట్టివాఁ
డెవఁడీయాగడమోర్చి సైపఁగలఁ డిప్డీదోసపుంబండ మె
ట్లవలం ద్రోయుటొ తోఁచదో పఱువ! నా కబ్బిమ్ముఁ
గల్గించెడిన్ ౧౦౧

ఆ. పుట్టలోనఁ దినుచు పునుక పేరులు దాల్చి
వల్లకాటి బూది నెల్లఁ బూసి
తోలుఁ గప్పుకొనుచు మేలుమేలిక మీాఁద
పొలనుఁగూడ మెక్కఁబూనినావ? ౧౦౨

---

15. నాట — ఖండగతి

ప. ఎవ్వరిటుసల్పిరర రే! యీా చెడుగుచేత
కెటులీవు నోర్చితి విసీ! తెల్పు ముక్కంటి॥ ఎ॥

అ. కొఱివ్వనన్ మంచిచెడ్డలఁ దెలియకిటుసేయు
కుచ్చితుని చేఁతలకు - కుల్కు చున్నావహాహా!॥ ఎ॥

మి. దవ్వుల నేమరువునఁదాఁగెనో యీాతుంటరి
బుద్ధిదిట్టి వానిం బోకార్చక యుందునె॥ ఎ॥

శా. ఏమీ యింతటి దోసపుంబనికి నీ వెట్లోర్చితో వేల్ప! నా
కీమీఁదన్ వివరింపకున్న నిఁక నా కెవ్వారు దిక్కౌదురో
సామీ! బూచులఁదోలు మేటిదొర వీచందంబునన్ మూఁగవై
యేమైనన్ దలకింప వుల్లమున నీకీ కీడు ముద్దయ్యెనే? ౧౦౩

క.16 అని కటకటపడి బాపఁడు
పనివిని నీరముచు దెచ్చి బాగుగ నా లిం
గని, గుడినిఁ గడిగి తాసం
బొసరిచి మంత్రముల సుద్దినొందినపిదపన్ ౧౦౪

క. తొలిమిన్కు-పోకడల నా
తొలి దేవర తండ్రిఁ గొలిచి తొందరగా, నా
తులువం జూపకయున్నన్
తల నీపయిఁ గొట్టికొందుఁ దడయక ననుచున్. ౧౦౫

తే. నిప్పుమట్టినకోఁతియ ట్లప్పుడతఁడు
వెఱ్ఱి సివమెత్తి గంతులు వేయు చటకు
నిటకుఁ బఱ్ఱెత్తుచును నెలుగెత్తి యేడ్వ
వినఁబడియె పల్కు-లిటు వినువీదినుండి ౧౦౬

ఉ.17 ఇంచుక తాళుమయ్య! యిటులెందుకు తత్తరపాటు తెల్పెదన్
మంచిగొనాలకున్ నెలవు, మాయఁ మెఱుంగఁడు, దొడ్డబత్తులం
దెంచఁగ మానికంబు, జగమెల్లను నన్నుగఁ జూచు నెప్పుడా
చెంచుకొమారుఁ డిట్లుగొలిచెన్ శివకేసరి! నన్ను వేడుకన్. ౧౦౭

---

## 16. మంజరి — ధన్యాసి

౧. అవి కటకటపడి శివకేసరి గుడినంతయు నీటుగఁ జేసి
నెనువెంట నె నీటగ్రుంకి దాఁ గడు వేడుక లింగని డాసి

౨. కునుకపేర్లు వల్లకాటిబూదెయు — పులితోలుఁదాల్తునంచు
మనమున వేడుకపడితే నంజుడులను దినుట మంచిదంచు॥

ఉ. అన్నిటి నన్నుఁగాఁ దలఁచు నాతఁడెడంగను, వేయునేలఁ దాఁ
దిన్నదినేనఁ జేకొనమి తెంపరియై దిననొల్లఁ డెన్నఁడున్
తిన్ననిపోకడల్ గలిగి దిట్టరియై కడువెఱ్ఱిబత్తితో
తిన్నఁడు సంగఁ జేర్వడసె తెల్పఁగ సోదెము వానిచెయ్దముల్. ౧౦౮

క. ఇదితగని, దిదియు తగినది,
ఇదిచిన్నది; యిదియు దొడ్డ; దిదికూడని, ది
య్యది మంచిదనుచు నెఱుఁగం
డది యిది యను, వేఱెమెందు, నతఁడెఱుఁగఁడు సూ. ౧౦౯

---

## 17. నీలాంబరి — చతురశ్రగతి

ప. ఇంచుక తాళుమయ్య! శివకేసరి!॥ ఇంచు॥

అ. మించినబత్తిని ననుఁ గొల్వవచ్చి
చెంచుకుఱ్ఱఁ డొనరించె నీపగిది॥ ఇంచు॥

చ. మంచిగొనములకు నెలవాతఁడు దా
నించుక మోసంబనున దెఱుంగఁడు
ఎంచిన బత్తుల తలమానికమని
పించుకొనఁగలఁడు కడుదొడ్డబుద్ధి॥ ఇంచు॥

౧. అన్నియునేనేయని మదిఁ దలఁచెడు
నెన్నఁడును మఱి యింకొక్కటెఱుంగఁడు
కన్నుల కగపడునవియెల్ల నేనె
గా మదినెంచెడు దమ్మముఁ దప్పఁడు॥
పన్నుగఁ దా నిడు నోగిరముఁ దినమి
నెన్నాళ్ళకైనఁ దా దిననొల్లఁడు
తిన్ననినడతల నలరు వేయేలఁ
దిన్నఁడనఁ బేరఁ బిలువఁబడు నతం॥ డించు॥

సీ. నిక్కపుబత్తియు, నొక్కండె వేల్పను
తలఁపును, దమ్మమ్ముఁ దప్పమియును,
కల్లలాడమియును, కలకఁబారని మది
నందఱ నొకపోల్కి నరయుటయును,
కోర్కులఁబోనాడి గొల్చుచుండుటయును
నేను, నీవనుబుద్ధి మానుటయును,
సందియ మెపుడు నాయందుఁ బొందమియును,
నోరిమితోడఁ జెన్నారుటయును,
గీ. నెవ్వఁడలరెడు నతఁడిచ్చ నెద్దియైనఁ
గుడుతు మిక్కటమైన ప్రేముడిని సుమ్ము
కొలము, బెలమును, కొద్దియుం, గొప్ప నాకుఁ
గలదె; బత్తియు, గొనములఁ దలఁతుగాని. ౧౧౦
తే. అరనిముస మాగు మింతలో నాతఁ డరుగు
దెంచి, కావించుచేఁతలఁ గాంచఁగలవు
'దాగియుండు'మనంగ నత్తఱిని సబ్రి
మంది బాపఁడు గుడిలోని గొందె నిమిడె. ౧౧౧
ఉ. అత్తఱిఁ జూచువారలకు నచ్చెరువయ్యెడుపోల్కి, దొన్నెలన్
మెత్తనిపండ్లు, తేనెయును, మేలిమితియ్యనికల్లు, నంజుడుల్
పత్తిరిఁ బూలుఁ బట్టికొని బాగుగ పుక్కిట నీరముంచి, తా
బత్తి మొగాన నుట్టిపడఁ బఱ్వనఁ దిన్నఁడువచ్చె వేల్మిడిన్. ౧౧౨
క.18 పుక్కిటఁ బట్టిన నీటిని
గ్రిక్కన లింగమును గడిగి గన నింపొదవన్
జక్కగ పూలను, బత్తిరి
మిక్కిలి కైసేసి బత్తిమీఱఁగ పిదపన్. ౧౧౩

తే. దొన్నెలను దేనెయును పుట్టజున్ను నింపి
పుల్లియుల పండ్లు, కఱకుట్లు ప్రోవువోసి
మ్రొక్కి తినుమంచు వేడిన మునుపటివలె
ఓగిరము మెక్కకా వేలు పూరకున్న. ౧౧౪

చ. పలుకవదేమి కన్నులను - బాగుగ విప్పవదేమి యింతలో
నలిగితివయ్యా! జాలమనియా? మఱి తప్పిదమెద్దియైన నే
సలిపితినయ్యా! తెల్పుమని సాగిలి మ్రొక్కిన నీసరుండు దా
వలపలకంటనీరు దిగనార్చఁగఁ దిన్నఁడు తొట్రుపాటునన్ ౧౧౫

తే. వెఱపునన్ బాపురే! యిట్లు వేఁడినీరు
కనుల దిగజారుచుండె నే కతమొ యనుచు
నబ్రమందుచు తబ్బిబ్బు నతఁడు సెంది
కడఁగి కన్నుల చెఱఁగుతోఁ దుడువఁజొచ్చె. ౧౧౬

క. తుడిచినకొలంది నీరి
న్నడిగా దిగజారుచుండ మాయురె! యిది యె
క్కడి తెవులు నీకుఁ జేకురె
నడవిని నే వెజ్జకడకు నరుగంగలనో. ౧౧౭

సీ.19 ఏమిసేయుదు తండ్రి యింతలో నిట్లయ్యె
నేమి గోరమొ కటా! యెంత బాద

---

18. మంజరి — చతురశ్రగతి

౧. పుక్కిట నీటిని నెత్తిపైఁ జిమ్మి-పూలను పత్రిరి వైచె
మ్రొక్కి తాఁదెచ్చు తిండిని వేడుక-మెక్కుమని కేలుసాచె
౨. మునుపటివలె నోగిరముఁ దినక వలకనునుండి నీరువిడువ
పెనువెఱపున నది గని తిన్నఁడు తబ్బిబ్బున దానిం దుడువ.

పడుచుంటివో నీవు - పబువ! యీ తెవులెట్లు
గలిగె సుంతయు నాకుఁ దెలియరాదు
అబ్బబ్బ! నీరాగి అదిగో! నెత్తురుగారు
చున్నది నేనెట్లు - మన్నువాఁడ
ఇంచుక నోర్చు మింకెచ్చోటికైనను
నరిగి మందును దెత్తునయ్య! నీకు

గీ. అనుచు తటబాటునం జని యటకు, నిటకు
బరువులెత్తుచు నెద్దియో పచ్చియాకు
నోట నిడుకొని మదిని టాటోటులేక
నమలి పసరును కంటిలో నుమిసె నతఁడు. ౧౧౮

తే. ఉమియునంతట నచ్చెరువొంద గ్రుడ్డు
పాళముగ క్రిందకుంజారి బైటఁబడిన
బాపురేయంచు గుండెను బాదుకొనుచు
పలుదెఱఁగులేడ్చి తిన్నఁడిప్పరుసఁ బల్కె. ౧౧౯

ఉ. ఒక్కటి తోఁచె నాకు నిపుడూరటఁజెందుము నాదుకన్నులం
దొక్కటి తీసియిత్తునను చొయ్యనఁ దిన్నఁడు వింటికోలతో

---

## 19. సింధుర — త్రిశ్రగతి

ప. ఏమిసేతురా! తండ్రి! యేమిసేతురా! తండ్రి! ఏమి॥
అ. ఏమిసేతు నేమిసేతు నింతలోన నిట్టులయ్యె॥ నేమి॥
౧. ఏమిగోరమో అకటా! ఎంత బాదపడుచుంటివో
సామీ! నీకిట్టి తెవులు - సమకూరుట కేమి కతమొ॥ ఏమి॥
౨. అబ్బబ్బా! నీకుమాని - అదిగో నెత్తురుగారెడు
దబ్బునఁ జని మందుఁదెత్తు - తాళుము యోరిమినొందుము ॥ఏ॥

చక్కఁగ కన్నుదీసి తన సామి కమర్చినయంతఁ బోక పెం
పెక్కిన నెత్తురోడె నపుడే యెడకంటికి జేసికంటికిన్. ౧౨౦

క. అదిగని తిన్నఁడు తత్తర
మెదలో ముక్కుటముఁగాఁగ నీసరునిం దా
ముదవింపఁ జొచ్చె నిట్టుల
పదిలంబుగ నిలచి మ్రానుపడి నిట్టురియై. ౧౨౧

ఉ.20 అగ్గినిదించి నన్ను నిటు లారడిపెట్టఁగ నెంచినావొ, నే
తగ్గదనింతలోనని యెదం దలపోసితివేమొ, నాకు నే
యెగ్గును లేదు, నిన్నెడయ నెట్టుల సల్పినఁగాని, నేను నీ
దగ్గఱఁ బండియుండెదను తక్కినకన్ను నొసంగి దేవరా! ౧౨౨

ఆ. నీకు కన్నులున్న నాకు లేకున్నను
లోటుగలదె యెడఁదలోన నిన్ను
నిలిపి కొల్చువాఁడ - నెలమి నాకది చాలు
కనికరంపుఁ జూడ్కిఁ గనుము నన్ను. ౧౨౩

తే. ఇదిగొ రెండవకన్ను నే నిపుడె తీసి
యిత్తు సందియమేల నాకింక, నీదు
అడుగుదమ్ములఁ బండెద హాయి దనర
వేఱె తలఁపులు లేక నో వేల్పుఱేఁడ! ౧౨౪

---

20. శివరంజని — చతురశ్రగతి

ప. అగ్గిలోదింపినఁ బరికించెదవా? మాయప్పా ఇది యేటినాయ॥మగ్గి॥
అ. తగ్గిపోదుననుకొందువా- నీవుదక్క-నాకు నొకులున్నారందువ॥అగ్గి
౧, నీకనికరంపుజూడ్కి- నాపయి-నిగిడింపఁజాలు నాతలపుమిన్న
నాకు నిముఁజూడుకన్నులింకేల - నాతండ్రీ! నీయండనేనున్న॥ అగ్గి॥

తే. గుఱుతు దెలియదు పిమ్మట గ్రుడ్డినాఁడు
ననుచు నెడకంటిపై తన అడుగు బొటన
వ్రేలినినొప్పి “యింక నా బెడద వాయు
నన్ను నీలోనఁ జేర్చుకొమ్మన్న!” యనుచు ౧౨౫

క. అని కోలను రెండవ కం
టిని దీయఁగ దలపడంగ - నివ్వెఱపాటుం
గని మిన్ను వాక తాలుపు
కనికరమున కేలువట్టి - కలకల నగుచున్. ౧౨౬

తే.21 ఏటికీ తెగువనొనర్తు విట్లునీవు?
తిన్నఁడా! బత్తులందున మిన్ననీవు
మిన్ను మన్నున నినుఁబోలు మేటిబత్తు
లెన్నఁగా లేరు నీకు నే నిడితి ముత్తి. ౧౨౭

తే. అనుడు గొందెను డాఁగియున్నట్టి బాపఁ
డబ్రమందుచు కేల్మోడ్చి అపుడు వ్రాలె
తిన్నని యడుంగులన్, బేసికన్నులదొర
యిర్వురం గని ప్రేముడి మెసఁగఁ బల్కె. ౧౨౮

---

21. కన్నడ — ఖండగతి

ప. ఎందుకీ తెగువ గావింతువో తిన్న - నీ
చందమెఱిఁగితి నింక చాలుచాలును తాళు॥ మెందు॥

అ. ఎందైన నినుఁబోల రెవ్వరైనను బత్తి
నెన్న వినుప్రోలిలోనేని వేరననేల॥ ఎందు॥

౧. లెమ్ము శివకేసరీ! నమ్మితే నామాట
ఇమ్మాడ్కి బత్తినీ వెందైనఁ గన్నావ?

మి. బ్రొమ్మఁడ! తిన్నని గొనములకున్ బ్రోవీతం
డెమ్మొయిఁ దిన్నండన - నీతనికిం దగుఁగద॥ లెమ్ము॥

క. చూచితివా శివకేసరి!
యీచందము బత్తులందు యెం దరసితివే?
యీచొప్పు తిన్నఁడను పే
రీచెంచుకు దగును గాక యేరికి నగునే ౧౨౯

సీ. తెలిసెనా నీకు నీ తిన్నని నిక్కపు
బత్తియు, నీతని పట్టుదలయు
నమ్మికయును సందియమ్ము లేకుంటయు
డెందాన నిలకడ నొందుటయును
మొదలి సుగముఁ గోరకుంటయుఁ గోర్కులఁ
బోనాడి ననుగొల్వఁ బూనుటయును
అన్నిఁట నేనుందు నని నెమ్మినుంటయు
నెడఁదను గాడెప్పు డెడయుటయును

గీ. గల్లు తిన్నని బత్తుఁడు గాన నెప్డు
డిట్టివాఁ డిచ్చు నోగిర మెంచనేల?
నిట్టి మానిసిపుట్టువు నెన్న నేల?
కొల మడుగనేల గొనములఁ దలఁపవలయు. ౧౩౦

క. తిన్నని కతమున నేనీ
కన్నులకుం దోచవలసెఁ గాకున్నను నీ
వెన్నటికి గాంతువే? నీ
పున్నెమ్ములు వేగబండె హో నిక్కముగన్. ౧౩౧

ఆ. 22 ఎఱుక లేనిబత్తుఁ డీతఁడె, అన్నిఁట
నెఱుకఁగల్గి తిరము నెఱుఁగ నీవు
చెంచు తిన్నఁ డిపుడు చేసినాయందున
నింక నొక్కపుట్టు నీవు గనుము. ౧౩౨

క. ఆ పుట్టువులోఁ దిరముగ
న్నాపైఁ గడు బత్తిఁ గల్గి నమ్మికఁ గొలువన్
బ్రాపునఁ జేరుదు వనుచున్
బాపనికిన్ దెలిపె, వెఱఁగుపడ వెన్వెంటన్. ౧౩౩

క. తిన్ననిలోఁ గల వెలుఁగా
వెన్నుని చెలికానిలోన వేగమ సేరన్
కన్నులకుఁ దోఁప కీసరుఁ
డున్నెడ పాఱుండు సబ్రమున నిటు బొగడెన్. ౧౩౪

దండకము:— ఓదండి లింగయ్య! నీయండ లేకున్న నాకొండు దిక్కే-
దిరా! నన్ను నీవాఁడగాఁ జేయురా! నిన్ను మెప్పింప నేనెంతరా!
కన్నతండ్రి! బలే! నిన్ను నా వెన్నుఁడున్, బమ్మ, ప్రామిన్కలే
కీరితింపంగలే కూరుకున్నంత నేనెంతరా! ఎంతవారైన నీప్రేము
డిన్ బొందమిన్ నిన్నుఁ జేరంగలారే? పబూ! యీసరా! నాదు
దోసంబు లెక్కింపఁగా దమ్మమెట్లానురా! బుద్ధిలేనట్టి మొద్దున్
గదా! బేసికంటీ! జగంబెల్ల తార్మారుగాఁ జేయుచున్ బొమ్మ
లాటట్టు లాడించు టెల్లప్పుడున్ వేడ్క కాబోలురా నీకు;
కాకున్నచో కొద్ది గొప్పౌనటుల్, గొప్ప కొద్దౌనటుల్, కీడు
మేలౌనటుల్, మేలు కీడౌనటుల్ మారు టెట్లౌను; కాసంత
గుర్తింపఁగాలేక యున్నాను, డెందాన నేసందియం బొందు చు

---

22. మంజరి — చతురశ్రగతి

అని తెల్పుచుఁ తిన్నని నాలింగఁడు తనలోనఁ జేర్చుకొనియె
ననుఁ జేరుదు వింకొక పుట్టువునందని పాఱుని కపుడనియె
నెత్తి మోముకొని లింగని మ్రొక్కుచు నివ్వెరపడి పాఱుండు
అత్తఱి బంధములెల్లఁ ద్రెంచుకొని అచ్చపుఁ బత్తినతండు॥

సెయుదువో యనెటు సిన్న రయింగలో డూన .గాదె

, దబ్బములుఁ గడు సల్పుచున్న

క. పన్నుగ నీ తిన్నని కత
మన్ననఁ గడు బత్తిఁ జదువ - మానిసు లెలమిన్
వెన్నుని చెలికానిం గని
యెన్నఁడు మఱి పుట్టకుందు రిది నిక్కమగున్. ౧౪౦

పంచచామరము:-

సతంబు బూచులెల్లఁ గొల్చు జంగమయ్య దేవరా!
వెతల్ దొలంచి మ్రొక్కువారి వేల్పు మ్రోఁకువా దొరా!
ఇతం డతం డటంచు వేఱిమేమిలేని యీసరా!
కతం బెఱుంగరాని రూపు గల్గి వెల్గు దేవరా!

---

సురటి — మిశ్రగతి

ప. కొద్దిగొప్పలు లేక గొలిచిన బత్తుల
కోరిక లిడు సామి జేజేలురా నీకు జేజేలురా॥ కొ॥

అ. అద్దిరా! తొలి జంగమయ్య మ్రొక్కులతోనె
అరసి బ్రోచిన సామి - జేజేలురా। కొ॥

౧. విసమెల్లఁ దిని మేటివేల్పుబోనమ్ము సొం
పెసఁగ జేజేలకు నొసఁగిన తండ్రీ! జేజేలురా॥
విసువక తలఁపుల వేడిన బత్తుల
వెల్లమ్రోనై సిరులెల్ల నిచ్చెడు వేల్ప! జేజేలురా
నీకు జేజేలురా॥ కొ॥

స ం పూ ర్ణ ము.

సన్మంగళాని భవంతు.

---

# తప్పొప్పుల పట్టిక

## ముందుమాట

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| i | 6 | పడసి | పడని |
| i | 18 | చకువకు | చదువరు |

## పీఠిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| i | 1 | సాయుద్యము | సాయుజ్యము |
| ii | 18 | లోపమ ? | తగ్గెన ? |

## పండితాభిప్రాయములు

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| iii | 16 | యిదాని | యిద్దాని |

## గ్రంథము

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 2 | మాన్పచుఁ | మాన్పచు |
| 5 | 14 | నూరొకటి | ప్రోలొకటి |
| 21 | 13 | మానిన | మాలిన |
| 27 | 20 | లోపమ ? | తగ్గెన ? |
| 36 | 24 | బూదెయు | బూదియు |
| 41 | 23 | జూడు | జూడఁ |
| 43 | 2 | యెం | నెం |
| 45 | 24 | బంధము | బందము |

మ.రా:- ముద్రణాలయములో "ం" గుఱుతు టైపు లేనందున దంత్య చ, జల భేదమును పాటించలేనందుకు పాఠకులు మన్నింతురుగాక.

—ముద్ర కూర్పరి.

శ్రీ సాయిబాబా పవర్ ప్రెస్, విజయనగరం.

# విశారద గ్రంథమాలా ప్రచురణములు

## ముద్రితములు

| | | | రూ.న.పై |
|---|---|---|---|
| 1. చిత్రకేతూపాఖ్యానము | (హరికథ) | ... | 0—50 |
| 2. జడభరత చరిత్రము | (హరికథ) | ... | 0—75 |
| 3. భక్త కల్పాగము | (శతకము) | ... | 0—50 |
| 4. వివేక కౌముది | (శతకము) | ... | 0—25 |
| 5. శ్రీ రామలింగేశ్వర స్తుతి | (దండకము) | ... | 0—10 |
| 6. తిన్నని బత్తి (అచ్చ తెలుఁగు కావ్యము) | | ... | 1—00 |

## అముద్రితములు

1. గిరిజా పరిణయము (హరికథ)
2. మత్స్యావతారము (హరికథ)
3. శ్రీ సత్యనారాయణ వ్రత మాహాత్మ్యము (హరికథ)
4. విశ్వ సౌభాగ్యము (ఖండకావ్య సంపుటి)
5. రసిక జన వినోదిని (శృంగార చాటువులు)
6. స్వతంత్రం (జాతీయ గేయం)
7. శకుంతలా రామాయణము (పిల్లల పాటలు)

వలయువారు :-

బగ్గాం సన్యాసప్పన్న కవి,
హెడ్మాష్టరు, స్పెషల్ బోర్డు యెలిమెంటరీ స్కూలు,
రామభద్రపురం, బొనంగి పోస్టు.
(Via) విజయనగరం, (విశాఖ జిల్లా.)